ప్రజాస్వరం PRAJASWARAM తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 19 సంచిక : 176 మంగళవారం 02, మార్చి 2026 పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com

# మైనింగ్ ఈవేలంలో భారీ అక్రమాలు

**సూర్యాపేట జిల్లాలో వేలంలో అవినీతి**
**విచారణ చేపట్టి టెండర్లు రద్దు చేయాలి**
**1,100 ఎకరాల రిజర్వ్డ్**
**ఫారెస్ట్‌పై స్పష్టత లేకుండానే వేలం**
**కంపెనీల ఎంపికపై అనుమానాలు**
**టెండర్ రద్దు చేసి కొత్తవేలం నిర్వహించాలి**
**సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ లేఖ**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

మైనింగ్ బ్లాక్‌ల ఈవేలం ప్రక్రియలో తీవ్రమైన అక్రమాలు, విధానపరమైన లోపాలు, చట్ట ఉల్లంఘనలు జరిగాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సూర్యాపేట జిల్లాలోని ఈ వ్యవహారంపై తక్షణమే స్వతంత్ర విచారణ జరిపి, వివాదాస్పద టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి సోమవారం లేఖ మిగతా 2లో..

# కాంగ్రెస్ అసలు రంగు పూర్తిగా బయటపడింది

**ఉద్యోగుల కుటుంబాల్లో విషాదం నెలకొంది**
**ప్రభుత్వం మారినా పరిస్థితి మారలేదు**
**విశ్రాంత ఉద్యోగులకు బకాయిలు చెల్లించండి**
**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**
**ఇందిరాపార్క్ వద్ద నిరాహార దీక్ష**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

ఇచ్చిన హామీలు అమలుచేయని, విశ్రాంత ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించని రాష్ట్ర ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మిగతా 4లో..





# రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం

**ప్రజల నుంచే నాయకుడిగా ఎదిగాను**
**జడ్పీటీసీ నుంచి సీఎం స్థాయికి వచ్చాను**
**పదవుల కన్నా నమ్మకమే ముఖ్యం**
**నిస్వార్థంగా ప్రజా సేవ చేస్తున్నాం**
**రాజకీయాల కన్నా నమ్మకమే ముఖ్యం**
**పీఏసీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి**

**ప్రజాస్వరం, హైదరాబాద్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ కాంగ్రెస్ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల హాజరయ్యారు.

**జెడ్పీటీసీ నుంచి ముఖ్యమంత్రిగా**

సమావేశంలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, తాను 19 ఏళ్ల వయసులోనే జెడ్పీటీసీ స్థాయి నుంచి రాజకీయాల్లోకి అడుగు పెట్టానని తెలిపారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తాను ప్రజల మధ్య నుంచి ఎదిగానని చెప్పారు. గ్రామ స్థాయి రాజకీయాల నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి చేరుకోవడం సులభం కాదని, ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నానని గుర్తు చేశారు. రాజకీయాల్లో ఎప్పుడూ ప్రజా సమస్యలపైనే తన పోరాటం సాగిందని చెప్పారు. అధికారుల వద్ద పైరవీలు చేయడం, వ్యక్తిగత లాభాల కోసం రాజకీయాలు చేయడం తన స్వభావం కాదన్నారు. ప్రజల కోసం మాట్లాడినందుకే తనపై అనేక కేసులు పెట్టారని, కోర్టుల వరకు వెళ్లాల్సి మిగతా 2లో..

# గల్ఫ్‌ను కమ్మేసిన యుద్ధ మేఘాలు

**భారతీయుల రక్షణపై కేంద్రం దృష్టి**
**వందలాది విమానాలు రద్దు**
**ప్రత్యేక ఎయిర్‌లిఫ్ట్ కోసం చర్యలు**
**ఉపాధి కోసం వెళ్లిన వేలాది మంది**
**దుబాయ్‌లో చిక్కుకున్న పర్యాటకుల వేదన**
**యూఏఈ అధ్యక్షుడితో మోడీ చర్చలు**

**ప్రజాస్వరం, న్యూఢిల్లీ**


పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఇరాన్, అమెరికా సంయుక్త రాష్ట్రాలు-ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న సైనిక ఘర్షణలతో గల్ఫ్ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. ఈ పరిణామాల దృష్ట్యా పలు పశ్చిమాసియా దేశాలు తమ గగనతలాన్ని పూర్తిగా మూసివేశాయి. కొన్ని దేశాలు పాక్షికంగా విమాన రాకపోకలను నిలిపివేశాయి. దీంతో వేలాది మంది భారతీయులు గల్ఫ్ దేశాల్లోనే చిక్కుకుపోయారు.

**వందలాది విమానాలు రద్దు**

ప్రస్తుత పరిస్థితుల్లో ఇరాన్, ఇజ్రాయెల్‌తో పాటు ఇరాక్, సిరియా, ఖతర్, బహ్రెయిన్, కువైట్ తమ గగనతలాన్ని పూర్తిగా మూసివేశాయి. ఇక యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, జోర్డాన్ పాక్షికంగా విమాన సర్వీసులను నిలిపేశాయి. డ్రోన్లు, మిస్సైళ్ల దాడుల నేపథ్యంలో దుబాయ్, అబుదాబి, దోహా వంటి ప్రధాన నగరాల్లోని మిగతా 2లో..







# రాష్ట్రాలకు కేంద్రం అలర్ట్

**శాంతిభద్రతలు కట్టుదిట్టం**
**అంతర్జాతీయ ఉద్రిక్తతలతో నిర్ణయం**
**రాష్ట్రాలకు కేంద్ర హెం శాఖ లేఖలు**
**ఫిబ్రవరి 28న విడుదల**
**సీఎస్‌లు, డీజీలకు కీలక సూచనలు**

**ప్రజాస్వరం, న్యూఢిల్లీ**

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా అప్రమత్తత పెంచాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య మిగతా 2లో..

# భారత్-కెనడా సంబంధాలకు కొత్త దిశ

**వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతం**
**2030 నాటికి 50 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యం**
**ద్వైపాక్షిక సంబంధాల్లో సరికొత్త అధ్యాయం**
**కెనడా ప్రధాని మార్క్ కార్నీతో మోడీ భేటీ**
**గ్లోబల్ బయోఫ్యూయల్ కూటమిలోకి కెనడా**
**మార్క్ కార్నీ నిర్ణయాన్ని స్వాగతించిన మోడీ**

**ప్రజాస్వరం, న్యూఢిల్లీ**

భారత్, కెనడా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు కొత్తదశలోకి అడుగుపెట్టాయి. మార్క్ కార్నీ భారత పర్యటనలో భాగంగా సోమవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ భేటీలో ఇరు దేశాలు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. సమావేశం అనంతరం ఇద్దరు నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడి ముఖ్య అంశాలను వెల్లడించారు.

**గ్లోబల్ కూటముల్లో కెనడా చేరిక**

కెనడా ప్రభుత్వం గ్లోబల్ బయోఫ్యూయల్ కూటమి, అంతర్జాతీయ సౌరశక్తి కూటమిలో చేరాలని నిర్ణయించుకుంది. ఈ నిర్ణయాన్ని ప్రధాని మోదీ స్వాగతించారు. శుద్ధ ఇంధన రంగంలో రెండు దేశాలు కలిసి పనిచేయడం వల్ల ప్రపంచ వాతావరణ మిగతా 2లో..



# ముగిసిన డీసీసీ శిక్షణ శిబిరం



**చివరి రోజు ముఖ్య అతిథిగా రాహుల్ గాంధీ**
**వికారాబాద్‌లో పీఏసీ సంయుక్త సమావేశం**
**సీఎం రేవంత్ సహా తెలుగు రాష్ట్రాల పీసీసీ చీఫ్‌లు హాజరు**
**డీసీసీ అధ్యక్షులకు రాహుల్ దిశానిర్దేశం**
**రాజ్యసభ ఎన్నికలపై సుదీర్ఘ చర్చ కేంద్రంపై తీవ్ర విమర్శలు**

**ప్రజాస్వరం, న్యూఢిల్లీ**

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సోమవారం తెలంగాణలో పర్యటించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీల రాజకీయ వ్యవహారాల కమిటీల (పీఏసీ) సంయుక్త సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వికారాబాద్‌లోని ఎస్ఏపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఈ సమావేశం జరిగింది. పార్టీ బలోపేతం, రాబోయే రాజ్యసభ ఎన్నికల వ్యూహాలపై ప్రధానంగా చర్చించారు.

రాహుల్ గాంధీ ఉదయం శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనతో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉన్నారు. విమానాశ్రయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఇద్దరూ కలిసి మిగతా 4లో..

www.prajaswaramdaily.com WWW.PRAJASWARAMDAILY.COM

# గల్ఫ్‌ను కమ్మేసిన యుద్ధ మేఘాలు



**మొదటిపేజీ తరువాయి**

ఎయిర్‌పోర్టులు అత్యవసర సేవలకు మాత్రమే పరిమితమయ్యాయి. 1,000కిపైగా అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. రోజుకు సగటున 90 వేల మంది ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని విమానయాన వర్గాలు చెబుతున్నాయి.

**గల్ఫ్‌లో చిక్కుకున్న భారతీయులు**

ఈ పరిణామాలతో ఉద్యోగాల కోసం, వ్యాపారాల కోసం, విద్యాభ్యాసం కోసం, పర్యటనల కోసం వెళ్లిన వేలాది మంది భారతీయులు గల్ఫ్ దేశాల్లో ఇరుక్కుపోయారు. ముఖ్యంగా దుబాయ్, అబుదాబి, షార్జా, దోహా వంటి నగరాల్లో హోటళ్లలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. విమానాలు ఎప్పుడు పునఃప్రారంభమవుతాయో స్పష్టత లేకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

**కర్ణాటక ముందడుగు**

గల్ఫ్‌లోని భారతీయుల భద్రత అంశాన్ని తొలుత కేంద్ర దృష్టికి తీసుకెళ్లిన రాష్ట్రాల్లో కర్ణాటక ఒకటి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షాలిని రజనీశ్ భారత విదేశాంగ శాఖ, పౌర విమానయాన శాఖలకు వివరమైన నివేదిక పంపించారు. గల్ఫ్ ప్రాంతంలోని పరిస్థితులు, అక్కడి భారతీయుల భద్రతపై ఉన్న ఆందోళనలను ప్రస్తావించారు. కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థను సక్రియం చేసింది. రాష్ట్ర అత్యవసర కార్యకలాపాల కేంద్రం ద్వారా 24 గంటల హెల్ప్‌లైన్ నడుస్తోంది. గల్ఫ్ దేశాల్లో ఉన్న కర్ణాటక వాసుల వివరాలను సేకరిస్తున్నారు.

**సుఖ్‌బీర్ సింగ్ బాదల్ విజ్ఞప్తి**

సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకు విజ్ఞప్తి చేశారు. "మిడిల్ ఈస్ట్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. అక్కడ చిక్కుకున్న భారతీయులను వీలైనంత త్వరగా దేశానికి తీసుకురావాలి. విమాన మార్గాలు తెరుచుకున్న వెంటనే ప్రత్యేక ఎయిర్‌లిఫ్ట్ ఆపరేషన్ ప్రారంభించాలి" అని కోరారు.

**కేరళ ఘటన**

అజర్‌బైజాన్ నుంచి షార్జా మీదుగా కువైట్ వెళ్లాల్సిన ఓ విమానం అత్యవసరంగా కరాచీలో ల్యాండ్ అయింది. ఆ విమానంలో కేరళకు చెందిన ఒక కుటుంబం సహా ఎనిమిది మంది భారతీయులు ఉన్నట్లు సమాచారం. దీనిపై కేరళ ప్రభుత్వం విదేశాంగ శాఖతో సంప్రదింపులు జరిపింది. అవసరమైతే కొలంబో మార్గం ద్వారా వారిని భారత్‌కు తీసుకురావాలని సూచించింది.

**యూఏఈ అధ్యక్షుడితో మోదీ చర్చ**

మిడిల్ ఈస్ట్ పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో మాట్లాడారు. ఈ క్లిష్ట సమయంలో యూఏఈకు భారత్ సంఘీభావంగా నిలుస్తుందని తెలిపారు. దాడులను ఖండిస్తూ, ప్రాణనష్టానికి సంతాపం వ్యక్తం చేశారు. ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి భారత్ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు.

**కేంద్రం అత్యున్నత స్థాయి సమీక్ష**

ప్రధాని అధ్యక్షతన భద్రతా కేబినెట్ కమిటీ సమావేశమైంది. గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయుల భద్రతపై సమీక్ష జరిగింది. అవసరమైతే ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని, సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. వాణిజ్య కార్యకలాపాలు, ఇంధన సరఫరా, ప్రయాణికుల రాకపోకలపై ప్రభావాన్ని కూడా సమీక్షించారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ, "ప్రస్తుతం పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కానీ గల్ఫ్‌లో ఉన్న భారతీయులను సురక్షితంగా తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఉన్నత స్థాయిలో చర్చలు కొనసాగుతున్నాయి" అని తెలిపారు.

**దుబాయ్‌లో చిక్కుకున్న పర్యాటకుల వేదన**

రాజస్థాన్‌కు చెందిన నరేంద్ర ఖండేల్వాల్, నావల్ కిశోర్ గార్గ్ కుటుంబాలతో కలిసి దుబాయ్‌కు వెళ్లారు. మార్చి 1న భారత్‌కు తిరిగి రావాల్సి ఉండగా విమానాలు రద్దు అయ్యాయి. "హోటల్ ఖర్చులు పెరుగుతున్నాయి. బయటకు వెళ్లడానికీ భయంగా ఉంది. ప్రభుత్వం మాకు సహాయం చేయాలి" అని వారు కోరుతున్నారు. మహారాష్ట్రలోని ఠాణె నుంచి 23 మంది టూర్‌కు వెళ్లగా, వారిలో 12 మంది వృద్ధులు ఉన్నారు. విమాన సర్వీసులు రద్దు కావడంతో హోటళ్లలోనే ఉండాల్సి వచ్చింది. పుణెలోని ఇందిరా స్కూల్ ఆఫ్ బిజినెస్ స్టడీస్‌కు చెందిన 80 మంది ఎంబీఏ విద్యార్థులు, నలుగురు అధ్యాపకులు కూడా దుబాయ్‌లోనే నిలిచిపోయారు. వారిని సురక్షితంగా తీసుకురావాలని కళాశాల యాజమాన్యం కేంద్రాన్ని కోరింది. పంజాబ్‌లోని బటిండాకు చెందిన ఓ విద్యాసంస్థ ప్రిన్సిపల్ నీరు గార్గ్ మాట్లాడుతూ, "మా వద్ద దిర్హాం కరెన్సీ కూడా ముగిసింది. ఔషధాలు కొనలేని పరిస్థితి ఉంది. వెంటనే సహాయం కావాలి" అని విజ్ఞప్తి చేశారు.

**ముందున్న సవాళ్లు**

ప్రస్తుతం గల్ఫ్ ప్రాంతంలో సైనిక ఉద్రిక్తతలు తగ్గే సూచనలు కనిపించడంలేదు. గగనతలం ఎప్పుడు పూర్తిగా తెరుచుకుంటుందో స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో వేలాది మంది భారతీయులను సురక్షితంగా దేశానికి తీసుకురావడం కేంద్ర ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారింది. అయితే ప్రభుత్వం అన్ని మార్గాలపై చర్చలు జరుపుతోందని, అవసరమైతే ప్రత్యేక విమానాల ద్వారా ఎయిర్‌లిఫ్ట్ చేపడుతామని సంకేతాలు ఇస్తోంది. విదేశాంగ శాఖ హెల్ప్‌లైన్‌లు, రాయబార కార్యాలయాల ద్వారా భారతీయులతో నిరంతర సంబంధం కొనసాగిస్తోంది. గల్ఫ్ ప్రాంతంలోని తాజా పరిణామాలు భారతీయుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. పరిస్థితి సాధారణ స్థితికి చేరేవరకు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని ప్రభుత్వం సూచిస్తోంది.



# రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

వచ్చిందని పేర్కొన్నారు. అయినా వెనక్కి తగ్గకుండా ప్రజల కోసం నిలబడ్డానన్నారు.

**రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం**

దేశ రాజకీయ పరిస్థితులపై కూడా సీఎం స్పందించారు. ప్రస్తుతం దేశానికి మార్పు అవసరమని, అందుకోసం కాంగ్రెస్ పార్టీ బలపడాలని అన్నారు. రాహుల్ గాంధీని దేశ ప్రధానమంత్రిగా చూడడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అదే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశం కోసం రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. ఆయన సామాజిక న్యాయం, రైతుల హక్కులు, యువత ఉపాధి, మహిళల సాధికారత వంటి అంశాలపై నిరంతరం పోరాటం చేస్తున్నారని కొనియాడారు.

**తెలంగాణపై కాంగ్రెస్ పాత్ర**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో కాంగ్రెస్ పార్టీ పాత్రను సీఎం గుర్తు చేశారు. ముఖ్యంగా సోనియా గాంధీ తీసుకున్న నిర్ణయం వల్లే తెలంగాణ సాధ్యమైందని అన్నారు. ఆ త్యాగాన్ని ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆశలను నెరవేర్చే దిశగా పనిచేస్తోందన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సమర్థంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం తమ బాధ్యత అని చెప్పారు.

**పార్టీ బలోపేతంపై చర్చ**

పీఏసీ సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణంపై విస్తృత చర్చ జరిగింది. బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ప్రజల సమస్యలపై చురుకుగా స్పందించాల్సిన అవసరం ఉందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణ, రాబోయే ఎన్నికల వ్యూహంపై చర్చించినట్లు సమాచారం.

**కార్యకర్తలకు సందేశం**

సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాజకీయాల్లో పదవులు శాశ్వతం కావని, కానీ ప్రజల నమ్మకం శాశ్వతమని అన్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి నాయకుడి కర్తవ్యమని చెప్పారు. ప్రజల మధ్య ఉండి, వారి సమస్యలకు పరిష్కారం చూపే నాయకత్వమే కాంగ్రెస్ ప్రత్యేకత అని వివరించారు. యువత, మహిళలు, రైతులు, కార్మికులతో పార్టీ అనుబంధాన్ని బలపరచాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీ కార్యక్రమాలు చురుకుగా నిర్వహించాలని చెప్పారు.

**ఉత్సాహంగా ముగిసిన సమావేశం**

రాహుల్ గాంధీ సమక్షంలో జరిగిన ఈ సమావేశం కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే దిశగా కాంగ్రెస్ ముందుకు సాగాలని



నాయకులు అభిప్రాయపడ్డారు. మొత్తానికి, సాధారణ స్థాయి నుంచి ముఖ్యమంత్రి పదవికి చేరుకున్న తన ప్రయాణాన్ని ఉదాహరణగా చూపిస్తూ సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలకు స్పష్టమైన లక్ష్యం నిర్దేశించారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే తమ సంకల్పమని మరోసారి స్పష్టం చేశారు.

# భారత్–కెనడా సంబంధాలకు కొత్త దిశ

**మొదటిపేజీ తరువాయి**

లక్ష్యాల సాధనకు దోహదం అవుతుందని అన్నారు. క్లీన్ ఎనర్జీ రంగంలో ప్రత్యేక భాగస్వామ్యాన్ని ప్రారంభించేందుకు అంగీకరించారు. గాలి, సౌర, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో సంయుక్త ప్రాజెక్టులు చేపట్టనున్నారు. 2050 నాటికి తన విద్యుత్ గ్రిడ్ సామర్థ్యాన్ని రెట్టింపు చేయాలన్న కెనడా లక్ష్యంలో భారత్ కీలక భాగస్వామిగా ఉండనుంది.

**వాణిజ్యానికి కొత్త లక్ష్యాలు**

భారత్-కెనడా ఆర్థిక సంబంధాలను తదుపరి స్థాయికి తీసుకెళ్లాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయి. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 50 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందను త్వరలోనే ఖరారు చేయాలని నిర్ణయించారు. కెనడియన్ పెన్షన్ ఫండ్స్ ఇప్పటికే భారత్‌లో భారీగా పెట్టుబడులు పెట్టిన విషయాన్ని మోదీ గుర్తు చేశారు. భారత వృద్ధిపై కెనడా పెట్టుబడిదారులు నమ్మకం ఉంచుతున్నారని తెలిపారు. రవాణా, మౌలిక వసతులు, పునరుత్పాదక శక్తి, సాంకేతిక రంగాల్లో మరింత పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు.

**రక్షణ, టెక్నాలజీ రంగాల్లో సహకారం**


రక్షణ రంగంలో సంబంధాలను బలోపేతం చేసేందుకు 'డిఫెన్స్ డైలాగ్' వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. భద్రతా అంశాలపై నియమితంగా చర్చలు జరపనున్నారు. కృత్రిమ మేధస్సు, అంతరిక్ష సాంకేతికత, సైబర్ సెక్యూరిటీ, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం రంగాల్లోనూ కొత్త ఒప్పందాలు కుదిరాయి. స్పేస్ టెక్నాలజీలో సంయుక్త పరిశోధనలకు అవకాశం కల్పించనున్నారు. శాటిలైట్ డేటా వినియోగం, భద్రతా రంగాల్లో సహకారం పెంచాలని నిర్ణయించారు. ఇరు దేశాల శాస్త్రవేత్తలు, పరిశోధకులు కలిసి పనిచేసే విధంగా మార్గరేఖలు సిద్ధం చేయనున్నారు.

**విద్యా, సాంస్కృతిక బంధాలు**

భారత్‌లో కెనడియన్ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లు స్థాపించేందుకు ఒప్పందం కుదిరింది. విద్యా రంగంలో విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు పెంచనున్నారు. ఇరు దేశాల్లోని ఆదివాసీ, గిరిజన వర్గాల సాంస్కృతిక వారసత్వాన్ని పంచుకునేందుకు అవగాహన ఒప్పందం కుదిరింది. సాంస్కృతికపరమైన అనుబంధాలు ద్వైపాక్షిక సంబంధాలకు బలం చేకూరుస్తాయని నాయకులు అభిప్రాయపడ్డారు.

**భారత ఆర్థిక వ్యవస్థపై ప్రశంసలు**

మార్క్ కార్నీ మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థపై ప్రశంసలు కురిపించారు. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచిందన్నారు. భారతీయుల తలసరి ఆదాయం పెరుగుతున్న వేగం



గణనీయమని పేర్కొన్నారు. 2023లో జరిగిన జీ20 సదస్సులో భారత్ ముందుకు తీసుకువచ్చిన 'వసుధైవ కుటుంబకం' భావన ప్రస్తుత ప్రపంచ సవాళ్లకు సరైన దిశను చూపిందని అన్నారు.గత ఏడాది కాలంలో భారత్, కెనడా ప్రభుత్వాల మధ్య జరిగిన చర్చలు గత రెండు దశాబ్దాల కంటే ఎక్కువగా ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఇది కేవలం సంబంధాల పునరుద్ధరణ మాత్రమే కాకుండా, కొత్త శకానికి నాంది అని అభివర్ణించారు.

**పశ్చిమాసియా పరిస్థితులపై ఆందోళన**

సమావేశంలో పశ్చిమాసియా పరిస్థితులపై కూడా చర్చ జరిగింది. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త రాష్ట్రాలు మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో శాంతి చర్చలే సరైన మార్గమని ప్రధాని మోదీ అన్నారు. యుద్ధం ఎలాంటి సమస్యకు పరిష్కారం కాదని స్పష్టం చేశారు. అంతర్జాతీయ వేదికలపై శాంతి స్థాపనకు భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని తెలిపారు. విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తామని, అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రెండు ప్రజాస్వామ్య దేశాలు కలిసి మాట్లాడితే శాంతి సందేశం మరింత బలంగా వినిపిస్తుందని మోదీ పేర్కొన్నారు.

**ఉద్రిక్తతల నేపథ్యంలో వ్యాఖ్యలు ప్రాధాన్యం**

ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సైనిక చర్యల తరువాత పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగాయి. పలు ప్రాంతాల్లో దాడులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మోదీ చేసిన శాంతి పిలుపు అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యం సంతరించుకుంది.

**కొత్త దశలో భారత్–కెనడా సంబంధాలు**

మొత్తానికి ఈ భేటీతో భారత్-కెనడా సంబంధాలు మరింత బలోపేతం అయ్యాయి. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, శక్తి, సాంకేతికత, విద్యా రంగాల్లో విస్తృత సహకారం ప్రారంభమైంది. 2030 నాటికి వాణిజ్య లక్ష్యాన్ని చేరుకోవాలన్న సంకల్పంతో ఇరు దేశాలు ముందుకు సాగుతున్నాయి. భారత్-కెనడా సంబంధాలు ఇప్పుడు కేవలం ద్వైపాక్షిక ప్రయోజనాలకే పరిమితం కాకుండా, గ్లోబల్ శాంతి, స్థిరత్వం, పర్యావరణ పరిరక్షణ వంటి విస్తృత అంశాలపై కలిసి పనిచేసే దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ సమావేశం రెండు దేశాల మధ్య కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టినట్టే కనిపిస్తోంది.

# రాష్ట్రాలకు కేంద్రం అలర్ట్

**మొదటిపేజీ తరువాయి**

పెరుగుతున్న యుద్ధ వాతావరణం ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తుండగా, భారత్‌లో కూడా దాని ప్రభావం పడే అవకాశం ఉందని కేంద్రం భావిస్తోంది. ముఖ్యంగా సామాజిక, మత పరమైన ఉద్రిక్తతలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది.ఫిబ్రవరి 28న రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులు, పోలీస్ డైరెక్టర్ జనరల్స్‌కు కేంద్ర హోంశాఖ లేఖ రాసింది. దేశంలో ఎక్కడా శాంతి భద్రతలకు భంగం కలగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించింది. విదేశీ పరిణామాలు దేశీయ పరిస్థితులపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ఇంటెలిజెన్స్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించింది.

మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో కొన్ని వర్గాలు భావోద్వేగాలకు లోనయ్యే అవకాశం ఉందని కేంద్రం పేర్కొంది. ముఖ్యంగా మతపరమైన సమావేశాలు, సభలు, పెద్ద ఎత్తున జరిగే ప్రజా కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని తెలిపింది. ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రజల్లో విభేదాలు రేకెత్తించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేసింది.ఇటీవల అమెరికా సంయుక్త రాష్ట్రాలు చేపట్టిన సైనిక చర్యల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా చర్చలు ముదురుతున్నాయి. ఈ పరిణామాలు భారతదేశంలోనూ ప్రతిస్పందనలు కలిగించే అవకాశం ఉందని కేంద్రం అంచనా వేసింది. అందుకే సోషల్ మీడియా వేదికలపై పుకార్లు, తప్పుడు ప్రచారం, విద్వేషపూరిత పోస్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్రాలకు ఆదేశించింది. తప్పుడు సమాచారాన్ని వెంటనే గుర్తించి తొలగించడంతో పాటు, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొంది.

రాష్ట్ర పోలీస్ విభాగాలు, స్థానిక ఇంటెలిజెన్స్ యూనిట్లు, కేంద్ర ఏజెన్సీల మధ్య సమన్వయం మరింత పెరగాలని కేంద్రం సూచించింది. అనుమానాస్పద సమావేశాలు, గుంపుల కదలికలు, విదేశీ నిధుల ప్రవాహం వంటి అంశాలను జాగ్రత్తగా పరిశీలించాలని తెలిపింది. పరిస్థితి తీవ్రరూపం దాల్చే ముందు ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా అల్లర్లు, ఘర్షణలు నివారించవచ్చని అభిప్రాయపడింది.సున్నిత ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించాలని రాష్ట్రాలకు సూచనలు అందాయి. అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు కంట్రోల్ రూమ్‌లు సిద్ధంగా ఉంచాలని, 24 గంటల నిఘా వ్యవస్థను అమలు చేయాలని ఆదేశించింది. అవసరమైతే వేగంగా స్పందించే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని కూడా తెలిపింది.

విదేశాల్లో ఉన్న భారతీయుల భద్రతపై కూడా కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టింది. ముఖ్యంగా గల్ఫ్ దేశాల్లో పని చేస్తున్న లక్షలాది మంది భారతీయుల పరిస్థితిని సమీక్షిస్తోంది. అవసరమైతే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు దౌత్యపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందని అధికారులు వెల్లడించారు. భారత రాయబార కార్యాలయాలతో నిరంతర సంబంధం కొనసాగిస్తున్నట్లు తెలిపారు.భారత్ ఈ విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఒకవైపు అంతర్జాతీయ వేదికలపై శాంతి, చర్చల ద్వారా సమస్యల పరిష్కారానికి మద్దతు తెలుపుతూనే, మరోవైపు దేశీయ భద్రతను కట్టుదిట్టం చేస్తోంది. ఎలాంటి విదేశీ ఉద్రిక్తతలు దేశంలో అంతర్గత సమస్యలకు దారితీయకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కూడా కేంద్రం పిలుపునిచ్చింది. నిర్ధారించని వార్తలను నమ్మవద్దని, సోషల్ మీడియాలో వచ్చిన ప్రతి సమాచారాన్ని పంచుకునే ముందు ధృవీకరించాలని సూచించింది. ప్రజల్లో భయం కలిగించే సందేశాలను ఫార్వర్డ్ చేయకుండా ఉండాలని కోరింది. ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపింది.రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కేంద్ర ఆదేశాల మేరకు చర్యలు ప్రారంభించాయి. ముఖ్య నగరాలు, మతపరమైనంగా సున్నితమైన ప్రాంతాల్లో అదనపు నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ఇంటెలిజెన్స్ వర్గాలు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయి. జిల్లా స్థాయిలో శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, విద్వేష ప్రసంగాలు, సోషల్ మీడియా దుష్ప్రచారంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపశమనం ఉండదని స్పష్టం చేశారు. శాంతి భద్రతలను కాపాడడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.నిపుణుల అభిప్రాయం ప్రకారం, అంతర్జాతీయ ఉద్రిక్తతలు పెరిగినప్పుడు దేశీయ స్థాయిలో భావోద్వేగాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతుంటాయి. అలాంటి పరిస్థితుల్లో ముందస్తు చర్యలు తీసుకోవడం చాలా అవసరం. కేంద్రం ఇచ్చిన సూచనలు అదే దిశగా ఉన్నాయని వారు అంటున్నారు.

మొత్తంగా చూస్తే, మధ్యప్రాచ్య పరిణామాలపై భారత్ అత్యంత జాగ్రత్తగా స్పందిస్తోంది. దేశంలో ఎక్కడా సామాజిక ఐక్యతకు భంగం కలగకుండా చర్యలు తీసుకుంటోంది. ప్రజల భద్రతే ముఖ్యమని, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు కొనసాగిస్తామని కేంద్రం స్పష్టం చేసింది. దేశంలో శాంతి, సామరస్య వాతావరణం కొనసాగేందుకు ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రజలు కూడా సహకరించాలని, పుకార్లకు లోనుకాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# మైనింగ్ ఈ-వేలంలో భారీ అక్రమాలు

**మొదటిపేజీ తరువాయి**

రాశారు. గనుల శాఖ చేపట్టిన ఈ వేలం ప్రక్రియ పారదర్శకతకు విరుద్ధంగా సాగిందని ఆయన విమర్శించారు. గనుల శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో చేపట్టిన ఈ వేలం ప్రక్రియలో విధానపరమైన లోపాలు, చట్ట ఉల్లంఘనలు, పారదర్శకత లోపాలు ఉన్నట్లు పేర్కొన్నారు. పసుపులబోడు, సైదుల్నామా, సుల్తాన్‌పూర్ మైనింగ్ బ్లాక్‌లలో సుమారు 1,100 ఎకరాల రిజర్వ్డ్ ఫారెస్ట్ భూమి ఉన్నప్పటికీ, టెండర్ పత్రాల్లో చట్టబద్ధంగా అవసరమైన కీలక వివరాలు పొందుపరచలేదని ఆరోపించారు. మినరల్ బ్లాక్‌ల ఖచ్చితమైన అక్షాంశ రేఖాంశ కోఆర్డినేట్లు, అటవీ కంపార్ట్‌మెంట్ వివరాలు, డీజీపీఎస్ సర్వే ధృవీకరణ, వివరణాత్మక సర్వే మ్యాపులు, యూటీఎం జియో కోఆర్డినేట్లు, అలాగే మినరల్ ఆక్షన్ రూల్స్, 2015, మైన్స్ అండ్ మినరల్స్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్, 1957 ప్రకారం అవసరమైన సమగ్ర జియోలాజికల్ నివేదికలు వెల్లడించలేదని లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి లోపాలు వేలం ప్రక్రియ యొక్క చట్టబద్ధతను, పారదర్శకతను తీవ్రంగా దెబ్బతీస్తాయన్నారు. టెండర్ నోటీస్ జారీకి ముందే మినరల్ బ్లాక్‌లను ఖచ్చితంగా గుర్తించి పూర్తి వివరాలు వెల్లడించడం తప్పనిసరి అయినప్పటికీ, ఈ నిబంధనలు పాటించలేదని విమర్శించారు.

**నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ లేకుండానే వేలం!**

ఈ అక్రమ టెండర్లపై మరింత ఆందోళన కలిగించే అంశాలను కూడా లేఖలో ప్రస్తావించారు. న్యాయపరమైన విచారణలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ వేలాన్ని ముందుకు తీసుకెళ్లడం, తెలంగాణ హైకోర్టు డబ్ల్యూపీ(పీఐఎల్) నెంబర్.21 ఆఫ్ 2024లో ఇచ్చిన సూచనలను పట్టించుకోకపోవడం, చట్టపరమైన, పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్లను ప్రకటించడం వంటి అంశాలు తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయన్నారు. సైదుల్నామా బ్లాక్‌కు డెక్కన్ సిమెంట్స్ లిమిటెడ్, సుల్తాన్‌పూర్ బ్లాక్‌కు ఎన్సీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థలను ప్రిఫర్డ్ బిడ్డర్లుగా ప్రకటించారని, ఈ సంస్థలు రిజర్వ్డ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ కేసులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. మైన్స్ అండ్ జియోలజీ శాఖ లీగల్ ఆఫీసర్ ఈ బ్లాక్‌ల సమాచారాన్ని గోప్యంగా పేర్కొంటూ ఫిర్యాదుదారుడికి ఇవ్వడానికి నిరాకరించడం పారదర్శకతపై అనుమానాలు పెంచుతోందన్నారు. అటవీ శాఖ నుంచి తప్పనిసరిగా పొందాల్సిన నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ లేకుండానే వేలం నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయని, రిజర్వ్డ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో నిబంధనలు పాటించకుండా మైనింగ్ జరగడం పర్యావరణానికి ముప్పు కలిగించడమే కాకుండా ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు.

**టెండర్ ప్రక్రియను రద్దు చేయాలి**

వేలం ప్రక్రియకు సంబంధించిన అన్ని చర్యలను తక్షణమే నిలిపివేయాలని, నోటిఫికేషన్ నెం. 2263906/DM&G MI/Lst/2023 కింద చేపట్టిన టెండర్ ప్రక్రియను రద్దు చేయాలని, స్వతంత్ర, పారదర్శక విచారణను నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని, అవసరమైన శాస్త్రీయ సర్వేలు, జియోలాజికల్ డేటా వెల్లడి, అటవీ అనుమతులు పొందిన తర్వాత మాత్రమే చట్టబద్ధంగా కొత్త టెండర్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సీఎస్‌కు కూడా పంపారు.

## జిల్లా ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు....



- **ప్రశాంత వాతావరణంలో కుటుంబ సమేతంగా హోలీ జరుపుకోవాలి...**
- **హోలీ పండగ పేరుతో ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దు...**
- **జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు...**

**మెదక్ మార్చ్ 02 (ప్రజా స్వరం)**

ప్రతి ఒక్కరూ ప్రశాంతమైన వాతావరణంలో కుటుంబ సమేతంగా సంతోషంగా హోలీ పండగను జరుపుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు కోరారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడిపి జరిమానాలకు, రోడ్డు ప్రమాదాలకు కారకులై జైలు పాలుకావద్దని హెచ్చరించారు. హోలీ పండగ వేళ మన తోటి అడపడుచుల పట్ల గౌరవప్రదంగా నడుచుకోవాలని, పండగ పేరుతో అనవసరంగా కొత్త చిక్కులు కొని తెచ్చుకోవద్దని సూచించారు. గొడవలకు, అల్లర్లకు పాల్పడితే అస్సలు ఉపేక్షించబోమని, చట్టపరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయని స్పష్టం చేశారు. గతంలో పండగ వేళ మద్యం మత్తులో చెరువులు, కుంటాల వద్ద స్నానాలకు వెళ్లి ప్రమాదాలకు గురై అనేక కుటుంబాలకు విషాదాన్ని మిగిల్చిన ఘటనలను గుర్తు చేశారు. మద్యం మత్తులో ఎవరూ కూడా చెరువులు, కుంటాల వద్దకు వెళ్లి ప్రమాదాలకు గురి కావద్దని తెలిపారు. చిన్న పిల్లలు తప్పనిసరిగా తల్లిదండ్రుల సమక్షంలోనే స్నానాలకు వెళ్లాలని, అతి ఉత్సాహంతో ప్రమాదాలకు గురి కాకూడదని అన్నారు. పిల్లల కదలికల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా దృష్టి పెట్టాలని, పిల్లల భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందని తెలిపారు. మన ఆనందం శాశ్వతంగా ఉండాలి. కానీ క్షణిక ఆనందం కోసం హోలీ పండగ వేళ చేసిన తప్పులు, జరిగిన ప్రమాదాలు లేదా మన అజాగ్రత్త వల్ల ఇతరులు ప్రమాదాలకు గురైతే, ఆ పండగ మొత్తం కుటుంబానికి చేదు జ్ఞాపకంగా మిగిలిపోతుందని హెచ్చరించారు. ఈ హోలీ పండగ ప్రతి ఒక్కరి జీవితాన్ని రంగులమయం చేయాలని ఆకాంక్షిస్తూ, జిల్లా ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

# సీసీ కెమెరాలను ప్రారంభించిన సీపీ రష్మీ పెరుమాళ్.

- **నేర శోధనలో సీసీ కెమెరాల పని తీరు భేష్..**
- **క్రైమ్ ఫ్రీ జిల్లా గా మార్చడమే సురక్ష నేత్ర కార్యక్రమం.**

**గజ్వేల్ వర్గల్ మార్చి 02 (ప్రజాస్వరం)**

సిద్దిపేట సురక్ష నేత్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని మీనాజీపేట్ గ్రామంలో సిద్దిపేట సీపీ సాధన రష్మీ పెరుమాళ్ సీసీ కెమెరాలను ప్రారంభించారు. స్నేహ ఫౌండేషన్ వారి సహకారంతో గ్రామంలోని ఎంట్రీ ఏక్సిట్ ఏరియాల్లో 19 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రారంభోత్సవ సందర్భంగా సీపీ రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ.. సీసీ కెమెరాల వలన గ్రామ భద్రత పెరుగుతుందని, నేర శోధనలో సీసీ కెమెరాల ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. సిద్దిపేట జిల్లాలను 'క్రైమ్ ఫ్రీ' గా మార్చడానికి 'సిద్దిపేట సురక్ష నేత్ర' అనే ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కెమెరాల పనితీరును ఎల్లవేళలా పరిశీలించాలని వాటి నిర్వహణ చూసుకోవాలని గ్రామ పాలకవర్గానికి సూచించారు. ఏసీపీ నర్సింలు మాట్లాడుతూ.. నిఘా నేత్రాలు గ్రామంలో ఉంటే భద్రత ఎక్కువగా ఉంటుందని, దొంగతనాలు, దోపిడీలు జరగకుండా కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఇటీవల మండలంలో జరిగిన హత్య కేసులో సీసీ కెమెరా ఫుటేజ్ ఎంతో కీలకం మారిందని వివరించారు. ఈ కార్యక్రమంలో స్నేహ ఫౌండేషన్ ఛైర్మెన్ రాజేందర్ రెడ్డి, గజ్వెల్ సీఐ రవి రాజు, గౌరారం ఎస్సై కరుణాకర్



రెడ్డి, గ్రామ సర్పంచ్ కీసరి వెంకటేష్, ఉపసర్పంచ్ రాణి సహదేవ్ గౌడ్, పంచాయితీ సెక్రటరీ బాబు రావు, గ్రామ వార్డు సభ్యులు, గ్రామస్తులు, మహిళలు, పాల్గొన్నారు.



## గ్రామ ముదిరాజ్ సంఘం ఏకగ్రీవ ఎన్నిక..

- **సంఘం అభివృది కి ఎల్లవేళలా కృషి చేస్తాం లింగ శేఖర్, కిచ్చుగారి పాండు**

**గజ్వేల్, వర్గల్ మార్చి 02 (ప్రజాస్వరం):-**

వర్గల్ మండలం నెంటూర్ గ్రామ ముదిరాజ్ సంఘ అధ్యక్షుడిగా లింగ శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యార ఆదివారం గ్రామంలో ముదిరాజ్ సంఘ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా కిచ్చుగారి పాండు నియామకమయ్యారు. ముదిరాజ్ సంఘం అభివృది కి ఎల్లవేళలా కృషి చేస్తానని, పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని అధ్యక్షులు లింగశేఖర్ స్పష్టం చేశారు.అనంతరం ఎన్నికైన అధ్యక్ష ఉపాధ్యక్షులను సంఘం నాయకులు సన్మానించారు.

## ప్రజావాణి లో ఒక దరఖాస్తు స్వీకరణ..
# తాసిల్దార్ గ్రేస్ బాయి



**నార్సింగి, మార్చ్ 02 ( ప్రజా స్వరం )**

ప్రజల దూర భారాన్ని, ప్రజల సమయాన్ని తగ్గించడం కోసమే మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తాసిల్దార్ గ్రేస్ బాయి తెలిపారు. సోమవారం నార్సింగి మండల కేంద్రం లోని తాసిల్దార్ కార్యాలయంలోప్రజావాణి నిర్వహించారు. తాసిల్దార్ గ్రేస్ బాయి మాట్లాడుతు ప్రజలదూర భారాన్ని, ప్రయాణ బత్యాల్ని, సమయాభావాన్ని తగ్గించడం కోసమే ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజావాణిలో ప్రజల నుండి వివిధ సమస్యలపై దరఖాస్తుల స్వీకరించినట్లు తెలిపారు, ఈ ప్రజావాణి కార్యక్రమంలో అన్ని సమస్యలు పరిష్కరించి, పరిష్కారం కాని వాటిని పై అధికారులకు పంపించడం జరుగుతుందని వారు తెలిపారు, వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్లైన్ చేసి, వారం రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలు జిల్లా కార్యాలయాల చుట్టూ తీరగవలసిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే వారి సమస్యలకు పరిష్కారం దొరికేల చర్యలు చేపడతామణి సూచించారు. నేటి ప్రజావాణిలో ఒక దరఖాస్తు స్వీకరించడం జరిగిందని తెలిపారు. ప్రతి సోమవారం మండల స్థాయిలో ఉన్న అధికారులందరూ అది తూచా తప్పకుండా ప్రజావాణి కార్యక్రమంలో హాజర అవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ గ్రేస్ బాయ్, ఎస్సై సృజన రెవెన్యూ ఇన్స్పెక్టర్లు శ్రీధర్ మేఘన వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. శేరిపల్లి సర్పంచ్ సంతోష గౌండస్వామి యాదవ్ మాట్లాడుతూ గ్రామం లోని భైరవ స్వామి ఆలయ భూమి సర్వే నంబర్ 136, 21 గుంటల భూమి సర్వే చేసి ఇవ్వాలని ప్రజావాణి లో ఫిర్యాదు ఇవ్వడం జరిగిందని తెలిపారు. వారి వెంట వార్డు సభ్యులు అరుణ్ యాదవ్, మల్లేశం, గ్రామస్తులు కుమార్ ఉన్నారు.



# రంగుల పండుగ హోళి

**హైదరాబాద్ మార్చి 02,ప్రజా స్వరం**

**రంగు రంగుల పండుగ హోళి**
**రంగుల హోళి జీవన కేలి**
**ప్రాచీనమైన పండుగ హోళి**
**పాటల పండుగ హోళి**
**ఆనందాల పండుగ హోళి!!**

**మోదుగు పూలచే రంగులతో ఆటపాట**
**పిల్లల పాటల హోళి**
**పొద్దంతా పాటల పండుగ**
**రంగుల హరివిల్లు హోళి!!**

**తెలంగాణ యాసలో పాటల హోళి**
**వసంత ఋతువు రాకతో వచ్చే పండుగ**
**పాటలతో మొదలయ్యే పండుగ**
**పది రోజుల పాటల పండుగ**

**మగవారు కొలలతో ఆట ఆడే పండుగ**
**స్త్రీల చప్పట్లతో పాటల పండుగ**
**ప్రకృతితో ముడిపడిన పండుగ హోలీ**
**పల్లె పల్లె నా పాటల పండుగ!!**

**రచన:-**
**దేవులపల్లి రమేశ్**
**కలం :వామిక శ్రీ వర్ష**
**నంగునూర్, సిద్దిపేట**
**9963701294**



## రెండు రాష్ట్రాలలో కాంగ్రెస్ బలోపేతం కోసం.. శిక్షణ

**తూప్రాన్ మార్చ్ 2 (ప్రజా స్వరం )**

వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి హిల్స్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ కమిటీ వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి హిల్స్ లో (డిసిసి) అధ్యక్షుల కోసం నిర్వహించిన శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమనికి విచ్చేసిన లోక్ సభ ప్రతిపక్ష నేత శ్రీ రాహుల్ గాంధీ ని కుటుంబసభ్యులతో మర్యాదపూర్వకంగా కలిసిన సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తుంకుంట అంక్షారెడ్డి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నర్సారెడ్డి మరియు సతీమణి చిన్న కూతురు కలిశారు అనంతరం నిర్వహించిన సమావేశంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యక్రమాలు మరియు రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై స్వల్పంగా చర్చించినట్లు టి .అంక్షా రెడ్డి తెలిపారు. శిక్షణా శిబిరం ద్వారా పార్టీ నాయకులకు సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలపై పోరాట విధానాలు,ఎన్నికల వ్యూహాలపై ప్రత్యేక అవగాహన కల్పించినట్లు నాయకులునర్సారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల డిసిసి అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు..




# చీరాల మరియు వేటపాలెం మండల స్థాయి సిబ్బందితో సమావేశం

- **డి ఎల్ డి ఓ .కే పద్మావతి**

**వేటపాలెం ఫిబ్రవరి 02(ప్రజాస్వరం):**

సోమవారం వేటపాలెం మండలం కొత్తపేట గ్రామపంచాయతీ నందు విభిజి రాజ్జి చట్టం 2025 గురించిన కొత్త మార్గదర్శకాలు గురించి చీరాల మరియు వేటపాలెం మండల స్థాయి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైనటువంటి డియల్డివో కే. పద్మావతి మాట్లాడుతూ ఎంజిఎన్ఆర్ఇజిఎస్ చట్టాన్ని సవరించి వికసిత భారత్ రోజ్గార్ మరియు అజీవిక మిషన్ గ్రామీణ చట్టం 2025 రూపొందించడం జరిగినదని, పథకం పేరు మార్చడంతో పాటు అదనంగా 25 రోజులు పెంచి 125 రోజులు పని దినాలు పెంచారని, పథకంలో అమలు అయ్యే పనుల గురించి మరియు విభిజి రాంజీ యొక్క ప్రయోజనాల గురించి 6 వారాలపాటు మండల మరియు గ్రామీణ స్థాయిలో ప్రజా చైతన్య కార్యక్రమాలు ఏర్పాటు చేసి చట్టం యొక్క లక్ష్యం ఉపాధి శ్రామికుల హక్కులు, చెల్లింపు వ్యవస్థ, పంచాయితీ ఆధారిత అమలు పై విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గ్రామ స్థాయి సిబ్బంది అందరూ ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించి పథకం యొక్క ఉద్దేశం, లక్ష్యాలు విశిష్టతను ప్రజలకు అర్థమయ్యేలా చేయాలనే ఉద్దేశంతో "జన్ సంవాద్" పేరుతో చేపట్టే ప్రచార కార్యక్రమాలు విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వేటపాలెం ఎంపీడీవో , ఏపీఓ మరియు చీరాల, వేటపాలెం ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, అనుబంధ శాఖల సిబ్బంది అందరూ పాల్గొనడం జరిగింది.




# బాన్సువాడ ఘటనలో బాధిత కుటుంబాలు అధైర్యపడొద్దని..

- **ఉంటామని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు**
- **బాధిత కుటుంబాలతో కామారెడ్డిలో మాట్లాడారు**

**కామారెడ్డి ప్రతినిధి మార్చి 02(ప్రజాస్వరం):**

బాన్సువాడ పట్టణంలో ఇటీవల జరిగిన ఘటనపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ఆరా తీశారు. పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బాన్సువాడ ఘటనలో అరెస్ట్ అయిన వారి కుటుంబ సభ్యులను బండి సంజయ్ పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ పరంగా జరిగిన ఘటన కాదు..బాన్సువాడ బీజేపీ ఇన్చార్జి యెండల లక్ష్మీనారాయణ ఘటన వివరాలను బండి సంజయ్కి వివరించారు. ఇది పార్టీ పరంగా జరిగిన గొడవ కాదని, ఒక యువతి పట్ల అసభ్యంగా కొందరు ప్రవర్తించారని బాధితులు పేర్కొన్నారు. బండి సంజయ్ మాట్లాడుతూ.. న్యాయవాదులతో తమ టీం మాట్లాడుతున్నట్టు తెలిపారు.ఎవరు కూడా అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు.బాన్సువాడ కు తమ నాయకులు వస్తుంటే అరెస్ట్ చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరే ఇలా ఉందని, వాళ్లే దాడులు చేసి మనవాళ్లను అరెస్ట్ చేస్తున్నారన్నారు. త్వరలోనే బెయిల్పై బయటకు తీసుకువస్తామని భరోసా ఇచ్చారు. అవసరం అయితే హైకోర్టుకు వెళ్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేతా..

- **20 వ వార్డ్ కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్**

**గజ్వేల్ మార్చి 02 (ప్రజాస్వరం):-**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ 20 వార్డులో నల్ల పోచయ్య అనారోగ్యంతో ఇటీవల మరణించారు సోమవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించిన 20 వ వార్డ్ కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ తక్షణ సహాయంగా కొంత ఆర్థిక సహాయం అందజేసి 25 కిలోల బియ్యంతో పాటు నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేశారు, మృతుని కుటుంబానికి భరోసా కల్పించి భవిష్యత్తులో ఎలాంటి సహాయం కావాలన్నా మమ్మల్ని సంప్రదించాలని వారికి భరోసా కల్పించారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు



# ముగిసిన డీసీసీ శిక్షణ శిబిరం

**మొదటిపేజీ తరువాయి**

వికారాబాద్‌కు వెళ్లారు.వికారాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తదితరులు రాహుల్‌కు స్వాగతం చెప్పారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు.

**రాజ్యసభ ఎన్నికలపై చర్చ**

ఈ నెల 16న తెలంగాణలో రెండు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల దాఖలుకు 5వ తేదీ చివరి గడువు. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై రాష్ట్ర నాయకత్వంతో రాహుల్ గాంధీ చర్చించినట్లు సమాచారం.ప్రస్తుతం రాజ్యసభ సభ్యులుగా ఉన్న అభిషేక్ మను సింఘ్వీ, కేఆర్ సురేశ్ రెడ్డి పదవీకాలం ఏప్రిల్ 9తో ముగియనుంది. కాంగ్రెస్ పార్టీకి అసెంబ్లీలో స్పష్టమైన మెజారిటీ ఉండటంతో రెండు స్థానాలూ గెలుచుకునే అవకాశం ఉంది. సింఘ్వీని మళ్లీ నామినేట్ చేసే అవకాశాలు ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అభ్యర్థులపై అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుంది.టికెట్ కోసం పలువురు సీనియర్ నేతలు ఆసక్తి చూపుతున్నారు. శ్యామ్ మోహన్ అనంతుల, వి. హనుమంతరావు, జి. చిన్నారెడ్డి, మధు యాష్కీ గౌడ్, ఎం. కోదండరెడ్డి తదితరుల పేర్లు చర్చలో ఉన్నట్లు సమాచారం.

**డీసీసీ అధ్యక్షులకు దిశానిర్దేశం**

పీఏసీ సమావేశం అనంతరం రాహుల్ గాంధీ అనంతగిరి హిల్స్‌లోని హరిత రిసార్ట్‌కు వెళ్లారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన నూతన డీసీసీ అధ్యక్షుల కోసం నిర్వహించిన 10 రోజుల శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయాలని ఆయన సూచించారు. గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీని చురుకుగా ఉంచాలని, ప్రజా సమస్యలపై నేరుగా స్పందించాలని ఆయన కోరారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం డీసీసీ అధ్యక్షుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.

**కేంద్రంపై విమర్శలు**

సమావేశంలో దేశ రాజకీయ పరిస్థితులపై కూడా రాహుల్ గాంధీ మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ తీసుకుంటున్న నిర్ణయాలు దేశానికి హానికరమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను కాంగ్రెస్ కార్యకర్తలు బహిర్గతం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు.దేశంలో యుద్ధ వాతావరణం నెలకొనేలా పరిస్థితులు తయారవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విదేశాంగ విధానాలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇండో-అమెరికన్ ట్రేడ్ ఒప్పందంపై కూడా ఆయన విమర్శలు చేశారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని కేంద్రానికి సూచించారు.

**స్పీకర్ గడ్డం ప్రసాద్ హాజరు**

పీఏసీ సమావేశ ప్రాంగణానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కూడా వచ్చారు. అయితే తాను స్పీకర్ హోదాలో కాకుండా స్థానిక ఎమ్మెల్యేగా రాహుల్‌ను కలిసేందుకు వచ్చినట్లు తెలిపారు. ప్రోటోకాల్ ప్రకారం సమావేశమయ్యానని చెప్పారు.

**సంస్థాగత బలోపేతమే లక్ష్యం**

మొత్తానికి రాహుల్ గాంధీ పర్యటనలో పార్టీ సంస్థాగత బలోపేతం, రాజ్యసభ ఎన్నికల వ్యూహం, కేంద్ర ప్రభుత్వంపై రాజకీయ దాడి ప్రధాన అంశాలుగా నిలిచాయి. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను మరింత బలపరచేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలుస్తోంది. రాబోయే రోజుల్లో అభ్యర్థుల ప్రకటన, పార్టీ కార్యాచరణపై స్పష్టత రానుంది. రాహుల్ గాంధీ పర్యటనతో తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహం కనిపించిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



# కాంగ్రెస్ అసలు రంగు పూర్తిగా బయటపడింది

**మొదటిపేజీ తరువాయి**

విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలనే డిమాండ్‌తో బీజేపీ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద సోమవారం నిరాహార దీక్ష చేపట్టింది. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ నేతలు గడ్డపార, పారలు పెట్టుకుని బయలుదేరారని సెటైర్లు వేశారు. డిక్లరేషన్ పేరుతో అన్ని వర్గాలను మోసం చేసిన రాహుల్ గాంధీ తెలంగాణలో ఎలా పర్యటిస్తారని ప్రశ్నించారు. నేషనల్ హెరాల్డ్ కోసం రూ.వెయ్యి కోట్లు గాంధీ కుటుంబానికి ఇచ్చేందుకు సిద్ధమని చెబుతున్నారని, కానీ హామీలు నెరవేర్చేందుకు మాత్రం నిధులు లేవా అని ప్రశ్నించారు. ఈ పరిస్థితి ఇలాగే ఉంటే ప్రజల కోపానికి దహించుకుపోవడం ఖాయమని హెచ్చరించారు. కాంగ్రెస్ హయాంలో కమీషన్ల పాలన సాగుతున్నదని ఆరోపించారు. రిటైర్డ్ ఉద్యోగులు తలుచుకుంటే ప్రభుత్వం ఒక్కరోజు కూడా నడవదని వార్నింగ్ ఇచ్చారు. టీజీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యోగుల కుటుంబాల్లో విషాదం నెలకొన్నదని, ప్రభుత్వం మారినా ప్రజల పరిస్థితి మారలేదన్నారు. విశ్రాంత ఉద్యోగులకు వారికి ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. చెల్లించకుంటే ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డట్టేనని పేర్కొన్నారు.

**బెనిఫిట్స్ కోసం ధర్నా చేయాల్సిన దుస్థితి..**

గతంలో రిటైర్మెంట్ ఉద్యోగులను ఘనంగా సాగనంపేవారని, కానీ నేడు బెనిఫిట్స్ కోసం ధర్నా చేయాల్సిన దుస్థితి వచ్చిందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. రాష్ట్రంలో ఇంత సిగ్గు మాలిన వ్యవస్థ ఉంటుందని భావించలేదన్నారు. కష్టపడి తెచ్చుకున్న తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ కన్నీరు పెట్టిస్తుందని అనుకోలేదన్నారు. భూములను భూ బకాసురులు, బ్రోకర్లు, బడా కంపెనీల కోసం అమ్ముతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజల శ్రమ, డబ్బు ఢిల్లీకి పోతుండటం బాధగా అనిపిస్తున్నదన్నారు. బ్యూరోక్రాట్స్ పరిస్థితి ఇంత దీనంగా ఉంటుందని భావించలేదని, పొలిటికల్ లీడర్లు ఫోన్ చేస్తే తమ చేతిలో ఏం లేదని చెప్పడానికి సిగ్గుండాలని ఫైరయ్యారు. ఇప్పుడు దీక్ష చేసి పోతామని, కానీ భవిష్యత్‌లో పోరాటాలకు సిద్ధమవుతామన్నారు.

**పొయ్యిలో నుంచి పెనం మీద పడినట్లు..**

పొయ్యిలో నుంచి పెనం మీద పడినట్లు రాష్ట్ర ప్రజలు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల పరిస్థితి దాపురించిందని ఎంపీ డీకే అరుణ మండిపడ్డారు. అధికారంలోకి రావడానికి ముందు మాయమాటలు చెప్పిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక తెలంగాణ ప్రజలను మోసం చేసిందని ఫైరయ్యారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగ కుటుంబాల్లో ఈ ప్రభుత్వం తీవ్ర అశాంతిని నింపిందన్నారు. వైద్య అవసరాలకు, కుటుంబ అవసరాలకు డబ్బులు లేక తీవ్ర మానసిక వేదనకు గురై ఇప్పటికే సుమారు 70 మంది ప్రాణాలు కోల్పోయిన పరిస్థితికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

**పంతుళ్లతో పంచాయితీ పెట్టుకొని మళ్లీ గెలవలేదు**

పంతుళ్లతో పంచాయితీ పెట్టుకుని, గోక్కున్న ఒక్క సర్కారూ మళ్లీ గెలవలేదని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఆకునూరి మురళి ఇచ్చిన ఏకసభ్య కమిషన్ రిపోర్ట్ అమలు చేస్తే ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. పార్లమెంట్‌లో ఏం మాట్లాడాలో తెలియని పప్పుతో శిక్షణ తరగతులు నిర్వహించి ఏం ఉపయోగమని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఎన్నికల ముందు ఇచ్చిన మాటలు ఒకసారి గుర్తు చేసుకోవాలని చురకలంటించారు. సీక్రెట్‌గా బిర్యానీ తినే రాహుల్ గాంధీ.. అశోక్ నగర్ స్టడీ సర్కిల్ దగ్గర సెక్యూరిటీ లేకుండా



ఐదుగురితో మాట్లాడితే చాలని.. వాస్తవాలు తెలుస్తాయన్నారు.

**పదవీ విరమణ చేసి ఏడాది గడిచినా నో బెనిఫిట్స్**

రాష్ట్రంలో ఉద్యోగులు పదవీ విరమణ చేసి ఏడాది గడిచినా బెనిఫిట్స్ అందించలేదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. రిటైర్డ్ ఉద్యోగులు చనిపోతున్నా వారి బెనిఫిట్స్ ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంట్రాక్టర్లకు కమీషన్ల కోసం రూ.కోట్లు విడుదల చేస్తున్న కాంగ్రెస్‌కు రిటైర్డ్ ఉద్యోగులు గుర్తు రావడం లేదా? అని ఏలేటి ప్రశ్నించారు. అనంతరం ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధులను కూడా వదల్లేదని, మోసం చేయడం కాంగ్రెస్ లక్షణమన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయించిన ఉద్యోగులు ఇప్పుడు ధర్నాలు చేస్తే ఏం లాభమని ప్రశ్నించారు. అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు తమ వద్దకు వస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో అయినా బీజేపీకి ఓటేసి ప్రాణం పోయాలని రాకేశ్ రెడ్డి కోరారు. వారి సమస్యలు పరిష్కరించి ఈ ధర్నా చౌక్‌లోనే సంతకాలు పెడతానని పేర్కొన్నారు.

**ఉద్యోగులు ఆందోళన పడొద్దు**

ప్రభుత్వం తొలి ప్రాధాన్యతగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని ఎమ్మెల్సీ మల్క కొమురయ్య డిమాండ్ చేశారు. ఉద్యోగులెవరూ ఆందోళన పడొద్దని, వారికి న్యాయం జరిగే వరకు తాము అండగా ఉంటామని భరోసానిచ్చారు. పబ్లిక్‌ను నమ్మించి కాంగ్రెస్ పవర్‌లోకి వచ్చిందని, రెండేళ్లయినా ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. రిటైర్మెంట్ ఫండ్స్‌ని ఇతర ప్రయోజనాలకు ప్రభుత్వం డైవర్ట్ చేస్తున్నదన్నారు. ఉద్యోగుల సొమ్మును ఇతర ప్రయోజనాలకు మళ్లించడం చట్ట రీత్యా నేరమన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు లేవని, ఒక్క తెలంగాణలోనే ఎందుకిలా అవుతున్నదని నిలదీశారు. అనంతరం ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ, పెన్షన్ అందక ప్రతినెలా రూ.వంద కోట్లు పెండింగ్‌లో పడుతున్నదన్నారు. అయినా ప్రభుత్వం తీరు దున్నపోతుపై వాన పడినట్లు ఉందని చురకలంటించారు. క్రమంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పోతున్నదన్నారు. రూ.10 వేల కోట్లు తెచ్చి విశ్రాంత ఉద్యోగుల బెనిఫిట్స్ అందించాలన్నారు.

# హోళీ పండుగ... ఈ జాగ్రత్తలు తప్పనిసరి..మరి

- **గాంధీ ఆసుపత్రి కంటి విభాగం హెచ్ఓడీ డా. రవిశేఖర్ రావు సూచనలు**

**సికింద్రాబాద్,మార్చి 02 ( ప్రజాస్వరం ):**

రంగుల పండుగ హోళీ అంటే చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ ఆనందంగా జరుపుకునే వేడుక. పరస్పరం రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపే ఈ పండుగలో ఆరోగ్య పరంగా నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రి కంటి విభాగం హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డా. రవిశేఖర్ రావు సోమవారం మాట్లాడుతూ...హోళీ వేడుకల్లో రసాయనిక రంగులను ఉపయోగించవద్దని సూచించారు. చర్మం, కళ్లకు హాని కలగకుండా సహజసిద్ధమైన రంగులను మాత్రమే వాడాలని తెలిపారు. రంగులు ఆడేటప్పుడు కంటి అద్దాలు ధరించడం మంచిదని, దీని వల్ల రంగులు నేరుగా కళ్లలోకి వెళ్లే ప్రమాదం తగ్గుతుందన్నారు. అనుకోకుండా రంగులు కంటిలో పడితే కళ్లను రుద్దకూడదని, వెంటనే శుభ్రమైన నీటితో బాగా కడగాలని చెప్పారు. కళ్లలో ఎర్రబారడం, మంట, వెలుగు చూడటంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే లూబ్రికేటింగ్ డ్రాప్స్ లేదా ఆయింట్‌మెంట్ వాడి, అవసరమైతే కంటి వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. హోళీ సందర్భంగా రంగులు చల్లే గొట్టాలు లేదా ఇతర వస్తువులు కంటికి, ముఖానికి దెబ్బతగిలితే వెంటనే కంటిపై ఒత్తిడి చేయకుండా సాదాసీదా బ్యాండేజ్ వేసి సమీప కంటి ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. అలాగే చర్మ సమస్యలు రాకుండా పూర్తి శరీరాన్ని కప్పేలా దుస్తులు ధరించడం మంచిదని తెలిపారు. ఆనందంగా హోళీ జరుపుకోవాలంటే ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి అని డా. రవిశేఖర్ రావు పేర్కొన్నారు.



# క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయి



- **గ్రామ సర్పంచ్ రజిత పరశురామ్**

**ప్రజాస్వరం గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, తిగుల్ పేరును జాతీయస్థాయిలో మారుమోగేలా యువత క్రీడల్లో రాణించాలని గజ్వేల్ న్యూరో వైద్యుడు శ్రీకాంత్ రెడ్డి, గ్రామ సర్పంచ్ రజిత పరుశురాం అన్నారు. తిగుల్ స్పోర్ట్స్ క్లబ్, గజ్వేల్ న్యూరో సంయుక్త ఆధ్వర్యంలో జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామంలో జిల్లాస్థాయి వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహించారు. ముందుగా సర్పంచ్ రజిత పరుశురాం, గజ్వేల్ న్యూరో డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, ఎం. డి భానుచందర్ క్రీడాజ్యోతి వెలిగించారు. క్రీడా పోటీలకు జిల్లాలోని వివిధ గ్రామాల నుండి మొత్తం 46 టీమ్ లు హాజరయ్యాయి. వాలీబాల్ క్రీడా పోటీల్లో ప్రథమ స్థానంలో గజ్వేల్ న్యూరో తీగుల్ వాలీబాల్ జట్టు నిలువగా, ద్వితీయ స్థానంలో అహ్మదిపూర్ వాలీబాల్ జట్టు నిలిచింది. క్రీడా పోటీలో గెలిచిన వారి గెలిచిన జట్లకు ప్రథమ బహుమతిగా రూ. 15,000 నగదు, ద్వితీయ బహుమతిగా రూ. 10,000 నగదు తోపాటు షీల్డ్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాలకు తిగుల్ గ్రామం పుట్టినిల్లు అని, ఎంతో మందిని క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ఘనత గ్రామానికి ఉందన్నారు. నేటి యువత స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటు చేసి మళ్లీ క్రిడలో గ్రామానికి పూర్వ వైభవం తీసుకరావడం గొప్ప విషయమన్నారు. యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉంటూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఆటలు ఆడడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. అలాగే క్రీడాల వల్ల యువత మధ్య స్నేహ భావం ఏర్పడుతుందన్నారు. క్రీడాలకు ఎల్లప్పుడూ తమ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, పి ఏ సి ఎస్ మాజీ డైరెక్టర్ భూమయ్య, పి ఈ టి రాజిరెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు సుధాకర్ రెడ్డి, ఎల్లయ్య, భానుప్రకాష్ రావు, బిక్షపతి, రామచంద్రారెడ్డి, వివిధ పార్టీల నాయకులు కృష్ణ మూర్తి, దయానంద్ రెడ్డి, అశోక్, ఎల్లారెడ్డి, మల్లేశం, మహేష్, కర్ణాకర్ రెడ్డి, ప్రవీణ్, ఐలయ్య, ఉపాధ్యాయులు శంకర్, నరేష్, జర్నలిస్ట్ లు రాంప్రసాద్ రావు, చిన్ని కృష్ణ, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు వంశీధర్ రెడ్డి, కార్యదర్శి కర్ణాకర్, తదితరులు పాల్గొన్నారు.



# డైమండ్ లారీ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

- **మన తోటి డ్రైవర్ మృతి చెందడం చాలా బాధాకరం**
- **లారీ డ్రైవర్స్ యూనియన్ సభ్యులు**

**ప్రజాస్వరం గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

లారీ డ్రైవర్స్ యూనియన్ సభ్యుడు అయిన మహిపాల్ రెడ్డి మృతి చెందడం చాలా బాధాకరమైన విషయం అని డైమండ్ లారీ డ్రైవర్స్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. డైమండ్ లారీ డ్రైవర్స్ యూనియన్ అసోసియేషన్ ప్రజ్ఞాపూర్ ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన సిద్దిపేట జిల్లా ములుగు గ్రామానికి చెందిన మహిపాల్ రెడ్డి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయంగా రూ.69,500 అరవై తొమ్మిది వేల ఐదు వందలు రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైపాల్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశామని, మైపాల్ రెడ్డి మృతి వారి కుటుంబానికి తీరని లోటు అని తెలిపారు. మనలో ఒకడు మన తోటి డ్రైవర్, మన లారీ డ్రైవర్స్ యూనియన్ అసోసియేషన్ సభ్యుడు మృతి చెందడం చాలా బాధాకరం విషయమని, మహిపాల్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నామని అన్నారు. వారితో పాటుగా డైమండ్ లారీ డ్రైవర్స్ యూనియన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నరేష్, కోశాధికారి శ్రీనివాస్, గౌస్, శ్రీను, రవి, మధు, వెంకటేష్ గౌడ్, రమేష్, రవి యాదగిరి, అన్వర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# శంకర్ పల్లి కోఆప్షన్ రేసులో మహమ్మద్ ఎజాస్

**శంకర్ పల్లి మార్చి 02(ప్రజాస్వరం):**

శంకర్ పల్లి మున్సిపల్ కోఆప్షన్ రేసులో చేవెళ్ల నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఎజాస్ ఉన్నట్లు పత్రిక ప్రకటనలో తెలిపారు. ఆ పదవి తనకే దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ఎన్ ఎస్ యూ ఐ లో కూడా చురుకుగా పాల్గొని ఎన్నోసార్లు పోలిస్ స్టేషన్లకు వెళ్లానని తన పై కేసులు కూడా నమోదు అయ్యాయి అని విద్యార్థులు సమస్యలు కోసం పోరాడాని అన్నారు. ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ పానెల్ సభ్యునిగా మరియు అతని అనుచరునిగా ఎన్ ఎస్ యూ ఐ బలోపేతం కోసం ఎంతో కృషి చేశానన్నారు. చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం తను ఎంతో కృషి చేశానన్నారు. సంవత్సరాల తరబడి పార్టీకి సేవలు అందించిన తనకు కో ఆప్షన్ పదవి దక్కుతుందని అన్ని విధాలుగా ఆ పదవికి తను అర్హుడనని పేర్కొన్నారు.





# హోలీ_ _ _ రంగుల పండుగ

ఉషోదయం ఎరుపు రంగుకు స్వాగతం.
మా ఇంటి శుభకార్యానికి పసుపు రంగు
తొలి పేరంటం.
నింగి–నేల నీలంతో నీరాజనం.
ప్రకృతి సంపద అడవితల్లి ఆకుపచ్చతో
అభినయం.
నిరసనతో నలుపు అలకప్రాయం.
అయ్యప్ప దయతో ఆనందప్రాయం.
విశ్వశాంతికి తెలుపు అందరికీ
ఆదర్శప్రాయం.
అన్నిరంగులను ఆహ్వానిస్తూ హోలీ
పండుగోత్సవం

రచన
శివ్వాం కిరణ్ కుమార్
ప్రధానోపాధ్యాయులు
డి. ఎ. వి. పబ్లిక్ స్కూల్
అనకాపల్లి.

# మొకిలా అసైన్డ్ భూమిని కాపాడండి

- -ఎమ్మార్వో సురేందర్ వినతి కు పత్రం అందజేత.

**శంకర్ పల్లి మార్చి 02(ప్రజాస్వరం):**

మొకిలలోని మిగులు అసైన్ భూమిని కాపాడాలని సోమవారం శంకర్ పల్లి ఎమ్మార్వో సురేందర్ కు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మొకిల గ్రామంలో సర్వే నంబర్ 31 లో ఈ మిగులు భూమిని అప్పటి గ్రామ పంచాయతీ లో హాస్పిటల్, అట స్థలానికి కేటాయించాలని తీర్మాణం చేశారన్నారు. కానీ ప్రస్తుతం కొందరు వ్యక్తులు ఆక్రమించి విక్రయంచేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజ ప్రయోజనం కోసం కేటాయించిన స్థలాలను ఆక్రమిస్తే ఊరుకోనేది లేదని, భూములను ఆక్రమిస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని అన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే చర్యలు చేపట్టి స్థలాలను ప్రజాప్రయోజనం కోసం వినియోగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్ కుమార్, ల్యాగాల నర్సిములు (ఎల్ఎన్ ఆర్), కావలి సురేందర్, నయీమ్, రజాక్, శ్రీను, కిరణ్, ప్రసాద్, లక్ష్మణ్, కరుణాకర్, డేనియల్, కుమార్, జావేద్, నారుద్దీన్, మాణిక్ ప్రభు, నర్సింలు, ఎన్ శ్రీను, లక్ష్మయ్య, అనంతయ్య, బడే సంజయ్, అజర్ తదితరులు పాల్గొన్నారు.




# మహిళా సంఘం భవనానికి ఘన శంకుస్థాపన

**వలిగొండ మార్చి 02(ప్రజాస్వరం):**

వలిగొండ మండలం పహిల్వాన్పూర్ గ్రామంలో కార్యక్రమం నిర్వహణ వలిగొండ మండలంలోని పహిల్వాన్పూర్ గ్రామంలో మహిళా సంఘం భవనం శంకుస్థాపన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బద్దం కరుణశ్రీ-పవన్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఈ భవనం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. గ్రామంలోని మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు మరియు వివిధ కార్యకలాపాలకు ఈ భవనం కేంద్ర బిందువుగా నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు సమన్వయంతో కలిసి పనిచేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



# హోంశాఖ మంత్రిని కలిసిన వార్డు కౌన్సిలర్లు

**కామారెడ్డి ప్రతినిధి మార్చి 02(ప్రజాస్వరం):**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ బీజేపీ వార్డు కౌన్సిలర్లు కేంద్ర హోం శాఖ మంత్రి బండి సంజయ్ ని కలిసిన పలు సమస్యలపై ఆరా తీసి మొన్న జరిగిన బాన్సువాడ విభేదాలు వల్ల సమస్యలను వారికి వివరించి బాన్సువాడ ఘటనలో బాధిత కుటుంబాలు అధైర్యపడొద్దని.. అని హోం శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు ఈ కార్యక్రమంలో బాన్సువాడ వాట్ కౌన్సిలర్లు 7 వార్డ్ మానస శ్రీకాంత్, 10 వార్డు పాశం భాస్కర్ రెడ్డి ఆమని, 16 వార్డ్ గజ్జల మహేష్ కుమార్, అట్లాగే బీజేపీ నాయకురాలు సాలే లావణ్య తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ మాదిగలకు రాజ్యసభ స్థానాన్ని కేటాయించాలి.

- లోక్ సభ స్థానాల్లో కాంగ్రెస్ మాదిగలకు ఒక టికెట్ కూడా ఇవ్వకుండా అన్యాయం చేసింది.
- అధిష్టానాన్ని ఒప్పించి మాదిగలకు రాజ్యసభ వచ్చేలా చూడాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిదే.
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా.గోవిందు నరేష్ మాదిగ.

**హైదరాబాద్ మార్చి 02(ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ సామాజిక వర్గానికి ప్రస్తుతం భర్తీ కాబోతున్న రాజ్యసభ స్థానాలలో కాంగ్రెస్ మాదిగలకు ఒక స్థానం ఇవ్వాలని , గత లోక్ సభ ఎన్నికల్లో ఒక్క టికెట్ కూడా ఇవ్వకుండా మాదిగలకు చేసిన అన్యాయాన్ని ఇప్పటికైనా సరిదిద్దుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా. గోవిందు నరేష్ మాదిగ, ఎంఎస్పి రాష్ట్ర కో ఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి మాదిగలు డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రం నుండి మాదిగలకు పార్లమెంట్ లో రాజకీయ ప్రాతినిధ్య లేకుండా కుట్రలు చేస్తుందని అన్నారు. ప్రస్తుతం తెలంగాణ నుండి పార్లమెంట్ లో ఒసిలకు, బీసీలకు, ఎస్టీలకు అలాగే ఎస్సీలలో మాలలకు ప్రాతినిధ్యం ఉందని అన్నారు. కానీ ప్రాతినిధ్యం లేని కులం మాదిగలు మాత్రమే అని అన్నారు. ఇప్పటికే రాజ్యసభలో ప్రాతినిధ్యం కలిగి ఉన్న రెడ్డి, బీసీ సామాజిక వర్గానికి ఇచ్చే బదులు అసలే రాజకీయ ప్రాతినిధ్యం లేని మాదిగలకు ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటించాలని డిమాండ్ చేశారు.

గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో మాదిగలకు ఏకకాలంలో రాజ్యసభలోను, లోక్ సభ లోను ప్రాతినిధ్యం ఉందని అన్నారు. లోక్ సభలో మంద జగన్నాథం, సిరిసిల్ల రాజయ్య మరియు రాజ్యసభలో నంది ఎల్లయ్య మాదిగ సామాజిక వర్గం నుండి అన్నారు. అలాగే చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలో ఏకకాలంలో టీడీపీలో తెలంగాణ నుండి ఇద్దరు మాదిగలు లోక్ సభ లో ఉన్నారు. అందులో ఒకరు మంద జగన్నాథం మరొకరు సుగుణ కుమారి, అదే సమయంలో టీడీపీ నుండి మరొకరు రాజ్యసభలో మాదిగ సామాజిక వర్గం నుండి ఆకారపు సుదర్శన్ ఉన్నారు. కానీ రేవంత్ రెడ్డి కాలంలో మాదిగలు లోక్ సభలో రాజ్యసభలోను ఒక్కరు కూడా లేకుండా పోయారని అన్నారు. రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు నాయుడులతో పోల్చుకుంటే మాదిగలకు సరైన ప్రాతినిధ్యం, గుర్తింపు ఇవ్వడంలో రేవంత్ రెడ్డి చాలా వెనుకబడి ఉన్నాడని స్పష్టం చేశారు. మాదిగ బిడ్డే ముఖ్యమంత్రిగా ఉన్నాడని అనుకోవాలని మాదిగలకు గొప్పలు చెప్పుకున్న రేవంత్ రెడ్డి ఆచరణలో మాత్రం మాదిగ జాతిపై సవతి ప్రేమను చూపుతున్నాడని అన్నారు.

మొన్న 5 శాసనమండలి స్థానాలు భర్తీ అయితే అందులో ఒకటి కూడా మాదిగలకు ఇవ్వలేదు అని అన్నారు. కనుక ఇప్పుడు చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన సమయం వచ్చిందని అన్నారు. ప్రస్తుతం భర్తీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల్లో ఒకటి మాదిగలకు కేటాయించే విధంగా అధిష్టానాన్ని ఒప్పించి న్యాయం చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీదనే ఉందని అన్నారు. రాజ్యసభలో రెడ్డిలకు ప్రాతినిధ్యం ఉన్న తర్వాత కూడా మళ్లీ రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వాలని చూడడం రెడ్ల పాలన నియంతృత్వనికి పరాకాష్టగా మారుతుందని అన్నారు. రాజ్యసభ స్థానాల్లో మాదిగలకు న్యాయం జరిగే వరకు మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు అవసరమనుకుంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ఆందోళనలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎంఎస్పి హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ మాదిగ ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఎంఎస్పి అధ్యక్షులు టివి నరసింహా మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామరపు శ్రీనివాస్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు ఇటిక శ్రీ కిషన్ మాదిగ, జిల్లా నాయకులు దాసు నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## కుటుంబ విశ్వాసానికి ద్రోహం
# రూ.10 లక్షల దోపిడీ

- దత్తపుత్రుడే నిందితుడు
- రూ.10.20 లక్షల ఆస్తి స్వాధీనం

**కూషాయిగూడ, మార్చి 02(ప్రజాస్వరం):**

'ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడు' అనే సామెతను తలకిందులు చేస్తూ కూషాయిగూడలో సంచలనం రేపిన ఇంటి దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఫిర్యాదుదారుడి దత్తపుత్రుడే నిందితుడిగా తేలింది. అతడి వద్ద నుంచి సుమారు రూ.10.20 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం... ప్రాంతానికి చెందిన వ్యాపారి జూపూడి ఆనంద్ గుప్తా (55) ఫిబ్రవరి 28న ఫిర్యాదు చేశారు. ఉదయం 11.30 గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల కార్యక్రమానికి వెళ్లి ఇంటికి తాళం వేసి వెళ్లారు. మధ్యాహ్నం 4.25 గంటలకు తిరిగి వచ్చేసరికి ప్రధాన తలుపు తెరిచి ఉండటాన్ని గమనించారు. ఇంట్లో అల్మిరాలు తెరిచి ఉండగా బంగారు పెట్టెలు చెల్లాచెదురుగా కనిపించాయి. పరిశీలనలో 38.3 తులాల బంగారు ఆభరణాలు, 3.7 కిలోల వెండి వస్తువులు, రూ.2,45,000 నగదు గల్లంతైనట్లు గుర్తించారు. మొత్తం ఆస్తి విలువ సుమారు రూ.10.80 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఫిర్యాదు మేరకు క్రైం నెం.165/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



**ముందుగానే పన్నాగం...**

దర్యాప్తులో భాగంగా తమ్మిమేని తిరుపతి రెడ్డి అలియాస్ మహిదర్ గుప్తా (28)ను అదుపులోకి తీసుకున్నారు. అతడు ఫిర్యాదుదారుడి దత్తపుత్రుడేనని తెలిసి పోలీసులు ఆశ్చర్యపోయారు. ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్న నిందితుడు కారు కొనుగోలు చేసి ట్రావెల్స్ వ్యాపారం ప్రారంభించాలనే ఉద్దేశంతో ఈ దొంగతనానికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. ఘటనకు ఐదు రోజుల ముందే ఇంటి తలుపుకు డూప్లికేట్ తాళం చెవి తయారు చేసుకున్నాడు. సంఘటన రోజు కుటుంబ సభ్యులను కార్యక్రమానికి దించి, ఎవరికి తెలియకుండా తిరిగి ఇంటికి వచ్చి తాళం తెరిచి దొంగతనం చేసి పరారయ్యాడు.


**స్వాధీనం చేసిన ఆస్తి...**


నిందితుడి వద్ద నుంచి హారాలు, గొలుసులు, ఉంగరాలు, బంగారు బిస్కెట్లు, నాణేలు తదితర ఆభరణాలు, 2.5 కిలోల వెండి బార్లు, 500 గ్రాముల వెండి నాణేలు, 700 గ్రాముల వెండి బిందేలు, రూ.2,13,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.10.20 లక్షల విలువైన ఆస్తిని పోలీసులు రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా, తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

## చీరాల వాడరేవుపిడుగురాళ్ల జాతీయ రహదారి
# 167 పై ఘోర రోడ్డు ప్రమాదం

**చీరాల ఫిబ్రవరి 02(ప్రజాస్వరం):**

చీరాల వాడరేవు నుండి పిడుగురాళ్లకు వెళ్లే జాతీయ రహదారి-167పై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పర్చూరు నుండి చీరాల వైపు వెళ్తున్న అశోక్ లేలాండ్ మినీ వ్యాన్ అతివేగంగా దూసుకెళ్లి రోడ్డుపై నడుస్తున్న మహిళను మరియు ఆమె వెంట ఉన్న గేదెలను ఢీకొట్టింది. స్థానికుల సమాచారం మేరకు ప్రమాదానికి ప్రధాన కారణం వాహనం అతివేగమేనని తెలుస్తోంది. ఈ ప్రమాదంలో చీరాల మండలం ఈపురుపాలెం గ్రామం స్థావరం పాలెంకు చెందిన కొమ్మనబోయిన సుబ్బాయ్యమ్మ (60) అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె తనకు చెందిన గేదెలను పొలంలో మేపుకుని ఇంటికి తీసుకెళ్తుండగా ఈ విషాదం జరిగింది. ప్రమాదంలో మొత్తం ఏడు గేదెలు కూడా మృత్యువాత పడ్డాయి. సంఘటన స్థలానికి చేరుకున్న స్థానికులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ దుర్ఘటనతో ఆ ప్రాంతమంతా దుఃఖంలో మునిగిపోయింది. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.





## 43 మంది లబ్ధిదారులకు రూ. 2,073,963/ విలువైన
# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- బాపట్ల ఎమ్మెల్యే

**బాపట్ల ఫిబ్రవరి 2 (ప్రజాస్వరం):**

సోమవారం బాపట్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 43 మంది అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన రూ. 2,073,963/ విలువ గల చెక్కులను బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి లబ్ధిదారునితో వ్యక్తిగతంగా మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితిని మరియు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ:"ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరుపేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఆసుపత్రి ఖర్చుల భారంతో ఇబ్బంది పడుతున్న కుటుంబాలను ఆదుకోవడమే లక్ష్యంగా ఈ నిధులు మంజూరు చేయడం జరుగుతోంది. బాపట్ల నియోజకవర్గంలో ఏ ఒక్క పేదవాడు వైద్యం కోసం ఇబ్బంది పడకూడదన్నదే మా సంకల్పం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా నిరంతరం కృషి చేస్తాం అని అన్నారు. ముఖ్యమంత్రి నిరంతరం ప్రజల కష్టాలను ఆలకించి, తక్షణమే స్పందిస్తున్నారని, అందుకు ఈ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులే నిదర్శనమని పేర్కొన్నారు. ఎటువంటి మధ్యవర్తులు లేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. బాపట్ల నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా తానూ, ప్రభుత్వం అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.




# అనంతసాగర్ లో ఎంఐఎం జెండా ఆవిష్కరణ

**సంగారెడ్డి మార్చ్ 02(ప్రజాస్వరం):**

సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం ముస్లింల ప్రస్తావన వస్తే, బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ఒకటేనని ఎంఐఎం పార్టీ ఏరియా కన్వీనర్ గౌస్ బాషా అన్నారు. సోమవారము కొండాపూర్ మండలం పరిధిలోని అనంతసాగర్ లో ముస్లిం మైనార్టీ యువకులను ఎంఐఎం కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించి అనంతరం పార్టీ జెండాను ఏరియా కన్వీనర్ గౌస్ పాషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌస్ బాషా మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ముస్లింలకు చేసిందేమీ లేదన్నారు. ప్రజా సమస్యల పైన ఎంఐఎం పార్టీ ఉద్యమిస్తుందన్నారు. పేదల సంక్షేమ కోసం ప్రభుత్వాల మెడలు వంచేది ఎంఐఎం పార్టీ అనే పేర్కొన్నారు. ఇరాన్ పై దాడులను తీవ్రంగా ఎంఐఎం పార్టీ ఖండిస్తుందన్నారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయేదుల్లా అలీ ఖమేనీ మృతి చెందడం బాధాకరమన్నారు. కొండాపూర్ మండలంలో ఎంఐఎం పార్టీని మరింత బలోపితం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మౌలానా తా బ్రెష్. ప్రధాన కార్యదర్శి హర్ష, అనంతసాగర్ గ్రామ అధ్యక్షుడు అజీముద్దీన్, వైస్ ప్రెసిడెంట్ మహమూద్, గ్రామ నాయకులు అప్రోచ్, సిరాజ్, షోయబ్ అత్తర్, మహబూబ్ అలీ, సమీరుద్దీన్, ఆమీర్, ముజీబ్, మహమ్మద్, అజ్మతులు పాల్గొన్నారు.





## ఈ నెల 4న పీసీసీ చీఫ్ షర్మిల జిల్లా పర్యటన

- పర్చూరు, చీరాలలలో ఉపాధి' పథకంపై రచ్చబండ

**చీరాల మార్చి 02(ప్రజాస్వరం):**

ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రలో భాగంగా పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల 4వ తేదీ బుధవారం బాపట్ల జిల్లాలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు.జిల్లా పార్టీ అధ్యక్షులు చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఆదేశాలతో సోమవారం వేటపాలెం మండలం కొత్తపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నియెజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతలు పీసీసీ చీఫ్ షర్మిల పర్యటన వివరాలను మీడియాకు వెల్లడించారు. ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రలో భాగంగా పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల 4న బుధవారం పర్చూరు నియెజకవర్గం ఇంకొల్లు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రచ్చబండ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి చీరాల నియెజకవర్గంలోని వేటపాలెం మండలం కొత్తపేట గ్రామంలో నిర్వహించే రచ్చబండ కార్యక్రమంలో పాల్గొంటారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుంటారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు నుంచి మహాత్మగాంధీ పేరు తొలగించి, పథకం పేరు మార్చిన వైనాన్ని ఆమె ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుందన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులతో సమావేశమై పార్టీని బలోపేతం చేయడంపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు మార్పు గ్రెగొరీ, ఏపీసీసీ మెంబర్ సయ్యద్ అల్లిం బాబు, కొత్తపేట మాజీ సర్పంచ్ చుండూరి వాసు, మాజీ కౌన్సిలర్ మల్లెల బుల్లిబాబు, షేక్ రెహమాన్, మిరియాల శ్రీనివాస్, దేవరపల్లి బాబురావు, మాజీ డెరెక్టర్ కనపర్తి బజ్జిబాబు, మేరిగ ఇస్సాక్, మేరిగ రమేష్, పులి శంకర్ తదితరాలు పాల్గొన్నారు .

## ఏసీబీ వలలో మరో అవినీతి తిమింగలం

- లంచం తీసుకుంటుండగా గ్రామ పాలన అధికారినీ పట్టుకున్న ఏసీబీ అధికారులు
- నిందితుని నుంచి 15000 స్వాధీనం

**కుత్బుల్లాపూర్ మార్చి 02(ప్రజాస్వరం):**

కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ నిర్వహించిన ఆపరేషన్‌లో గ్రామ పాలన అధికారి, అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న జూనియర్ అసిస్టెంట్ జి. గణేష్ లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు. ఏసిబి డిఎస్పి సిటీ రేంజ్ 1 శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ప్రాసెస్ జారీ చేయడానికి గ్రామ పాలన అధికారి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న జూనియర్ అసిస్టెంట్ జి.గణేష్ రూ.20 వేల లంచం డిమాండ్ చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేయడంతో సిటీ రేంజ్ -I బృందం పక్కా ప్రణాళికతో ట్రాప్ ఏర్పాటు చేసింది. ఒప్పందం ప్రకారం ముందుగా రూ.5 వేల రూపాయలను నగదుగా స్వీకరించిన గణేష్, మిగిలిన రూ.15 వేల సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 15 వేల స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం నిర్వహించిన రసాయన పరీక్షల్లో కూడా సానుకూల ఫలితాలు వచ్చినట్లు వెల్లడించారు. విధి నిర్వహణలో అనుచితంగా, అక్రమ లాభం పొందేందుకు ప్రయత్నించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు అధికారులు పేర్కొన్నారు. నిందితుడిని అరెస్టు చేసి నాంపల్లిలోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరు పరిచి కేసు దర్యాప్తు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా గోప్యంగా ఉంచినట్లు అధికారులు స్పష్టం చేశారు. లంచం డిమాండ్ చేసిన ప్రభుత్వం తరపున ప్రజలకు సేవలు అందించే అధికారుల పై వెంటనే స్పందించేందుకు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064 అందుబాటులో ఉందని తెలిపారు. అదేవిధంగా వాట్సాప్ నంబర్ 9440446106, సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.






## సింగరకొండ తిరుణాల మహోత్సవంలో ప్రత్యేక పూజలు

- కరణం బలరామ కృష్ణమూర్తి

**చీరాల ఫిబ్రవరి 02(ప్రజాస్వరం):**



సోమవారం అద్దంకి మండలం సింగరకొండ గ్రామంలో నిర్వహించిన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి మరియు లక్ష్మీ నరసింహ స్వామి వార్ల 71వ వార్షికోత్సవ తిరుణాల మహోత్సవానికి ఒంగోలు పార్లమెంట్ మాజీ సభ్యులు మరియు చీరాల మాజీ శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి, దేవస్థాన కమిటీ సభ్యులు మరియు గ్రామ ప్రజలతో కలిసి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మాదిగలకు రాజ్యసభ స్థానాన్ని కేటాయించాలి.

- తెలంగాణలో లోకసభ స్థానాల్లో నష్టపోయాం.. 5 MLC స్థానాల్లో కూడా అన్యాయానికి గురయ్యాం.
- అధిష్టానాన్ని ఒప్పించి మాదిగలకు రాజ్యసభ వచ్చేలా చూడాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిదే.
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ.

**జనగాం మార్చి 02(ప్రజాస్వరం):**



తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ సామాజిక వర్గానికి ప్రస్తుతం భర్తీ కాబోతున్న రాజ్యసభ స్థానాలలో కాంగ్రెస్ మాదిగలకు ఒక స్థానం ఇవ్వాలని , గత లోక్ సభ ఎన్నికల్లో ఒక్క టికెట్ కూడా ఇవ్వకుండా, 5 ఎమ్మెల్సీ స్థానాల్లో కూడా అవకాశం ఇవ్వకుండా మాదిగలకు చేసిన అన్యాయాన్ని ఇప్పటికైనా సరిదిద్దుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు. జనగామ జిల్లా కేంద్రంలోనీ విజయ ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు గద్దల కిషోర్ మాదిగ అధ్యక్షత వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్టం నుండి మాదిగలకు పార్లమెంట్ లో రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా కుట్రలు చేస్తుందని అన్నారు. ప్రస్తుతం తెలంగాణ నుండి పార్లమెంట్ లో ఒసిలకు, బీసీలకు, ఎస్టీలకు అలాగే ఎస్సీలలో మాలలకు ప్రాతినిధ్యం ఉంది కానీ ప్రాతినిధ్యం లేని కులం మాదిగలు మాత్రమే అని అన్నారు. మాదిగ బిడ్డే ముఖ్యమంత్రిగా ఉన్నాడని అనుకోవాలని మాదిగలకు గొప్పలు చెప్పుకున్న రేవంత్ రెడ్డి ఆచరణలో మాత్రం మాదిగ జాతిపై సవతి ప్రేమను చూపుతున్నాడని అన్నారు. మొన్న 5 శాసన మండలి స్థానాలు భర్తీ అయితే అందులో ఒకటి కూడా మాదిగలకు ఇవ్వలేదని, తెలంగాణలో అత్యధిక జనాభా కలిగి ఉన్న కూడా న్యాయమే చేశారని మండిపడ్డారు. కనుక ఇప్పుడు చిత్తశుద్దిని నిరూపించుకోవాల్సిన సమయం వచ్చిందని అందుకు ప్రస్తుతం భర్తీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల్లో ఒకటి మాదిగలకు కేటాయించే విధంగా అధిష్టానాన్ని ఒప్పించి న్యాయం చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీదనే ఉందని అన్నారు. ఇప్పటికే రాజ్యసభలో ప్రాతినిధ్యం కలిగి ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి ఇచ్చే బదులు అసలే రాజకీయ ప్రాతినిధ్యం లేని మాదిగలకు ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటించాలని డిమాండ్ చేశారు. గతంలో రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో మాదిగలకు ఏకకాలంలో రాజ్యసభలోను, లోక్ సభలోను ప్రాతినిధ్యం ఉందని అన్నారు. లోక్ సభలో మంద జగన్నాథం , సిరిసిల్ల రాజయ్య మరియు రాజ్యసభలో నంది ఎల్లయ్య మాదిగ సామాజిక వర్గం నుండే ఉండేవారని, అలాగే చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూడా అనాడు ఏకకాలంలో టీడీపీలో తెలంగాణ నుండి ఇద్దరు మాదిగలు లోక్ సభ లో ఉన్నారు. అందులో ఒకరు మంద జగన్నాథం మరొకరు సుగుణ కుమారి. అదే సమయంలో రాజ్యసభలో కూడా టీడీపీ నుండి మరొకరు మాదిగ సామాజిక వర్గం నుండి ఆకారపు సుదర్శన్ ఉన్నారనీ గుర్తు చేశారు. కానీ రేవంత్ రెడ్డి కాలంలో మాదిగలు లోక్ సభలో, రాజ్యసభలోను ఒక్కరు కూడా లేకుండా పోయారని అన్నారు. రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు నాయుడులతో పోల్చుకుంటే మాదిగలకు సరైన ప్రాతినిధ్యం, గుర్తింపు ఇవ్వడంలో రేవంత్ రెడ్డి చాలా వెనుకబడి ఉన్నాడని స్పష్టం చేశారు. రాజ్యసభలో రెడ్డిలకు ప్రాతినిధ్యం ఉన్న తర్వాత కూడా మళ్లీ రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వాలని చూడడం రెడ్ల పాలన నియంతృత్వనికి పరాకాష్టగా మారుతుందని అన్నారు. రాజ్యసభ స్థానాల్లో మాదిగలకు న్యాయం జరిగే వరకు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు అవసరమనుకుంటే ఎమ్మార్పీఎస్ ఆద్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ఆందోళనలు చేపడతామని అన్నారు.

## విఎన్ఆర్ కళాశాలలో విద్యార్థినిపై అఘాయిత్యం ఆరోపణ–ఇద్దరిపై కేసు

- విద్యాసంస్థల్లో భద్రత ఎక్కడ?బాచుపల్లిలో ఘటన

**కుత్బుల్లాపూర్, మార్చి 02(ప్రజాస్వరం):**

బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విజ్ఞాన జ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ లో తోటి విద్యార్థినిపై ఇద్దరు యువకులు అఘాయిత్యం చేశారని ఆరోపణలు వెలుగుచూశాయి. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీస్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, ఆశిస్ తనయా అనే విద్యార్థి గత ఏడాది నుంచి తనను వేధింపులకు గురిచేస్తున్నట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఘటనలో ఆశిస్‌తో పాటు ప్రవీణ్ అనే మరో విద్యార్థి కూడా తనపై అనుచిత ప్రవర్తన (మిస్ బిహేవియర్) చేసినట్లు ఆమె ఆరోపించారు. బాధితురాలు మరియు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు యువకులు కూడా బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులేనని తెలిసింది. బాచుపల్లి పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు. పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.




## మారుమూల గ్రామంలో ఎట్టకేలకు వచ్చిన సిగ్నల్..

- గుండంపల్లి వాసుల హర్షం!

**కొత్తగూడ మార్చి 02(ప్రజాస్వరం):**

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని గుండంపల్లి గ్రామస్తుల నిరీక్షణకు తెరపడింది. గత కొన్నాళ్లుగా సెల్ ఫోన్ సిగ్నల్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న వినియోగదారులకు నేడు ఊరట లభించింది. గ్రామంలో బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు చేసి చాలా రోజులు గడుస్తున్నప్పటికీ, సిగ్నల్ అందక ప్రజలు ఇబ్బంది పడ్డారు. అధికారులు, నాయకుల చొరవతో నేడు టవర్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంతో, మొబైల్ ఫోన్లలో బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ ప్రత్యక్షమైంది. ఇన్నిరోజులు టవర్ ఉండి సిగ్నల్ రాకపోవడంతో నెట్‌వర్క్ కోసం గ్రామస్తులు పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. నేడు సిగ్నల్ రావడంతో ఫోన్ కాల్స్, ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీనిపై స్థానిక బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు ప్రత్యేక ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. సిగ్నల్ పునరుద్ధరణతో విద్యార్థులకు, ఆన్‌లైన్ సేవలకు ఇకపై ఎటువంటి ఆటంకం ఉండదని గ్రామస్తులు భావిస్తున్నారు. ప్రభుత్వ నెట్‌వర్క్ అయిన బిఎస్ఎన్ఎల్ సేవలు మారుమూల ప్రాంతాలకు కూడా చేరడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. బిఎస్ఎన్ఎల్ నూతన కనెక్ట్ కోసం కావలసిన వారందరికీ బిఎస్ఎన్ఎల్ సిమ్ లు అందజేశారు.



## బుకబ్జాలకు పాల్పడుతు తప్పుడు పిర్యాదులు చేస్తున్న వారిపై కఠినపరమైన చర్యలు తీసుకోండి

**సంగారెడ్డి మార్చి 02(ప్రజాస్వరం):**

బీరంగూడ గ్రామస్తులు అనేక రకాలుగా బుకబ్జాలు చేస్తూ మళ్ళీ తప్పుడు పిర్యాదులు చేస్తూ అధికారులను ప్రజలను ఇబ్బంది పెడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని బీరంగూడ గ్రామ ప్రజలు అమీన్ పూర్ తహసీల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. శంబులింగేశ్వరా దేవస్థానం సర్వే నెంబర్ 783 20 గుంటలు పాత దేవాలయం పక్కన ఖాళీ స్థలంలో నూతన దేవాలయం నిర్మించి గత 8 సంవత్సరాలనుండి అనేక రకాలుగా మహాశివరాత్రి కార్తీక మాసం వినాయక చవితి ఉత్సవాలు నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారని 10 సంవత్సరాల క్రితం భూమి సర్వే నిర్వహించి దేవాలయం చుట్టూ చుట్టూ ప్రహరీ నిర్మంచడం జరిగిందని 10 సంవత్సరాల తర్వాత తప్పుడు పిర్యాదు చేస్తున్నారని అలాగే కీర్తి శేషులు నారాయణ పూర్వికుల ఆస్తి 767 లో 3 గుంటలు గత 50 సంవత్సరాల నుండి అనుభవిస్తున్నారని ప్రస్తుతం బఫర్ జోన్ రోడ్ వెడల్పులో 5 గుంటలు కోల్పోయారు. ఈ విషయం పై తప్పుడు పిర్యాదులు చేస్తూ అధికారులను ప్రజలను ఆలయ ధర్మకర్థలను భక్తులను ఇబ్బందికి గురిచేస్తు కొకలా శ్రీనివాస్ లింగంగౌడ్ భాస్కర్ రెడ్డి తప్పుడు పిర్యాదులు చేస్తు బుకబ్జాలు చేస్తున్నరని వాటిని వెంటనే తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. 1.కొకలా శ్రీనివాస్ శంబుణికుంట లో నిర్మించిన కమర్శియల్ భవనాన్ని వెంటనే కూల్చివేయాలని 2.శంబుని కుంట లో కబ్జాచేసి ఇళ్ళు నిర్మంచిన భాస్కర్ రెడ్డి ఇంటిని వెంటనే కూల్చివేయాలని 3.జయలక్ష్మి నగర్ బాలాజీ నగర్ లో నిబంధనలు పాటించకుండా హైటెన్షన్ బఫర్ జోన్ వదలకుండా యెలాంటి పర్మిషన్ లేకుండా నిర్మించిన 3 అంతస్తుల భవనాన్ని తక్షణమే కూల్చివేయాలని బీరంగూడ గ్రామస్తులు అమీనపూర్ తహసీల్దార్ కు సోమవారం విన్నవించారు. ఈకార్యక్రమంలో బీరంగూడ గ్రామ నాయకులు ఆదెల్లి రవీందర్, మాజీ వార్డ్ సభ్యులు సత్యానారాయణ, చిన్న వీరేష్, నక్కల కిష్టయ్య, ఎడ్ల రాజ మల్లేష్, బంటు శివ, బంటు రమేష్, ఎడ్ల అశోక్, శంకరయ్య, సార నరేష్, పెద్ద వీరేష్, బంటు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## 12 వ వార్డు కౌన్సిలర్ పులి మామిడి మమత రాజు దంపతులను ఘనంగా సన్మానించిన ఉషాకిరణ్ యూత్ సభ్యులు

**సంగారెడ్డి మార్చి 02(ప్రజాస్వరం):**

సదాశివపేట పట్టణంలోని పి.ఎం. ఆర్ క్యాంపు కార్యాలయంలో సాధారణ మున్సిపల్ ఎన్నికలలో 12 వ వార్డునుండి గెలిచినటు వంటి పులిమామిడి మమత రాజు దంపతులను ఉషాకిరణ్ యూత్ సభ్యులు శాలువాలతో మరియు పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఇట్టి సందర్భంగా బామిని రవి కుమార్ మాట్లాడుతూ మా చిన్నానాటి మిత్రుడు పులిమామిడి రాజు రానున్న రోజుల్లో రాజకీయంగా మరింత ఎత్తుకు యెదగాలని వారు ఇట్టి సందర్భంగా గుర్తు జేశారు. ఇలాంటి మంచి మిత్రుడు మాకందరికి దొరకడం మా పూర్వజన్మ సుకృతమని బామిని రవి మరియు బుసరెడ్డి పల్లి వెంకటేశం అన్నారు. అదేవిధంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ ఇంత చక్కటి మిత్రులు నా వెన్నంటు ఉండి ముందుకు నడిపిస్తున్నందుకు ఉషాకిరణ్ యూత్ సభ్యులందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలందరికి మరియు మిత్రులందరికి మరియు శ్రేయోభిలాషులకు ముందుగా హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు, సభ్యులు, మరియుపి.ఎం.ఆర్‌యువసేననాయకులుపాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999